శుక్రవారం
01-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 311
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యాలో మరో భారీ భూకంపం

మాస్కో: రష్యాలో మరోసారి భూకంపం సంభవించింది. కురిల్ ద్వీపకల్పంలో గురువారం ప్రకంపనలు వచ్చాయి. రిక్టరు స్కేలుపై తీవ్రత 6.5గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిమీల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించింది. కమ్‌చట్కా ద్వీపకల్పానికి 200 మైళ్ల దూరంలో తాజా ప్రకంపనలు సంభవించినట్లు తెలిపింది. కమ్‌చట్కా ద్వీపకల్పంలో 8.8 తీవ్రతతో బుధవారం భూకంపం వచ్చిన సంగతి విదితమే. వరుస భూకంపాలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అయితే సనామీ హెచ్చరికలు జారీ కాలేదు.

3 నెలల్లో స్పీకర్ నిర్ణయం

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై అనూహ్య తీర్పు

బీఆర్ఎస్ వాదనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు అనూహ్యమైన తీర్పు వెలువరించింది. కేసు వేసిన బీఆర్ఎస్ వాదనను దేశ అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. మూడు నెలల నిర్దేశిత గడువులోగా ఎమ్మెల్యే ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవాలని శాసనసభ స్పీకర్‌ను కోర్టు ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అలాగే గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని గవాయ్ ఆదేశించారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసుపై గురువారం సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై వాదోపవాదనలు నడిచాయి. ఈ ఏడాది ఏప్రిల్ మూడో తేదీన తీర్పును జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం రిజర్వ్ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వెలువడిన తీర్పులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా... అంటే మూడు నెలల్లోపు నిర్ణయించాలని, ఏ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదని, అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారిందని, దాన్ని అరికట్టకపోతే ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని పేర్కొంది. ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించామని, రాజేశ్ పైలట్, దేవేంద్ర నాథ్ మున్షి... అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే

- మిగతా 2 లో

తీర్పు స్వాగతిస్తున్నాం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని నిరూపించిన దేశ అత్యున్నత న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా పాంచ్ న్యాయం పేరుతో పార్టీ మారితే అనర్హత వర్తించాలని చెప్పిన రాహుల్ గాంధీ ... నిజాయితీ ఉంటే అనర్హత వేటు విషయంలో పంచ న్యాయ పేరుతో చెప్పిన నీతులను ఆచరణలో చూపించాలని కేటీఆర్ సవాలు చేశారు. రాహుల్ గాంధీ... భారత రాజ్యాంగాన్ని మరింత కాలం అవహేళన చేయబోరని ఆశిస్తున్నానని తెలిపారు. పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిరోజు పాల్గొంటున్న ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేల పై వెంటనే అనర్హత విధిస్తూ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రానున్న మూడు నెలల కాలంలో 10 నియోజక వర్గాల్లో జరిగే ఉప ఎన్నికలకు తమ పార్టీ సిద్ధం అవుతుందని, ఈ దిశగా పని చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతిమంగా సత్యం, ధర్మం గెలిచిందని అన్నారు.

మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితులకు విముక్తి

ముంబై: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఏడుగురు నిందితులను ముంబైలోని ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు తెలిపింది. 'ఈ కేసుకు ఉపా (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక) చట్టం వర్తించదు. ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్ మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్

- మిగతా 2 లో



చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు!

న్యూఢిల్లీ: సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూ కశ్మీర్‌లో భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు పునరుద్ధరణకు కేంద్రం సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిచిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లు ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. సావల్‌కోట్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980 నుంచే ఉంది. పాకిస్థాన్ అభ్యంతరాలతో 40 ఏళ్లుగా నిలిచిపోయింది. ఇటీవల

- మిగతా 2 లో

ఐదేళ్ల కనిష్ఠానికి పసిడి డిమాండ్

ముంబై: అధిక ధరలతో బంగారానికి ఉన్న డిమాండ్ ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోనుంది. ఈ మేరకు ప్రపంచ స్వర్ణ మండలి గురువారం వెల్లడించింది. పసిడి పెట్టుబడుల్లో స్వల్ప డిమాండ్ ఉన్నట్లు పేర్కొంది. ఈ ఏడాది డిమాండ్ 600-700 మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చని అంచనా వేసింది. ఇది 2020 నాటి కనిష్ఠస్థాయి కావడం గమనార్హం. గతేడాది గిరాకీ 802.8 టన్నులుగా ఉందని స్వర్ణమండలి ప్రాదేశిక సీఈఓ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

విభజన-విద్వేషమే రాజకీయ పంథా

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై డి.రాజా విమర్శ
- కేరళ నన్స్ అరెస్టుకు ఖండన

న్యూఢిల్లీ: విభజన, విద్వేషమే బీజేపీ-ఆర్ఎస్ఎస్ రాజకీయ పంథా అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ విభజన-విద్వేష రాజకీయం చేస్తున్నట్లు చెప్పడంలో సందేశం లేదు. మతం పేరిట ప్రజలను విభజిస్తున్నాయి. మైనారిటీలపై తీవ్ర దాడులకు పాల్పడుతున్నాయి' అని ఆయన వ్యాఖ్యానించారు. మానవుల అక్రమ రవాణా, మతమార్పిడి ఆరోపణలతో కేరళకు చెందిన ఇద్దరు నన్స్‌ను చత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వారి విడుదలకు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో చత్తీస్‌గఢ్‌లో ఒక మాట, కేరళలో మరో మాట మాట్లాడుతుండటం బీజేపీ వంచనను బయట పెట్టిందని వ్యాఖ్యానించారు. నన్స్ విడుదల కోసం కేంద్ర హోంమంత్రితో భేటీకి సీపీఐ ఎంపీలు యత్నిస్తున్నారని రాజా తెలిపారు. సీపీఐ-సీపీఎం బృందం చత్తీస్‌గఢ్‌లో పర్యటించినట్లు తెలిపారు. బాధితులను సీపీఐ ఎంపీలు, మహిళా నాయకులు కలిశారని చెప్పారు. ఈ వ్యవహారాన్ని కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఎంపీలు ప్రయత్నిస్తున్నారని, కేంద్ర స్పందన ఎలా ఉంటుందో చూద్దామని డి.రాజా అన్నారు.

ఆక్షేపణీయం: అనీరాజా, సునీర్

చత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నన్స్ అరెస్టు, గిరిజనులపై దాడుల సీపీఐ కార్యదర్శి అనీరాజా, ఎంపీ పీపీ సునీర్ ఖండించారు. సీపీఐ ఢిల్లీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం, కేసీఎం నాయకుల బృందం చత్తీస్‌గఢ్‌లో పర్యటించిందని, బాధితులను కలిసిందని చెప్పారు. ఆర్‌పీఎఫ్, బజరంగ్ దళ్ గూండాలు వేధించిన బాధితులను తాము

- మిగతా 2 లో

ఐపీఎస్ సంజయ్‌కు సుప్రీం షాక్

హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు

మూడు వారాల్లో కోర్టులో లొంగిపోవాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీంకోర్టు గురువారం గట్టి షాక్ ఇచ్చింది. గతంలో సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై

- మిగతా 2 లో

ఓట్ల చోరీకే ఎస్ఐఆర్

- నిలిపివేతకు విపక్షాల డిమాండ్
- పార్లమెంటు వద్ద 11వ రోజు ఆందోళన
- ఉధృత పోరుకు 'ఇండియా' నిర్ణయం
- వచ్చేవారం ఈసీ ఘెరావ్‌కు యోచన

న్యూఢిల్లీ: ఓటరు జాబితాల సవరణ 'ఎస్ఐఆర్'ను తక్షణమే నిలిపివేయాలన్న డిమాండ్‌తో తమ పోరాటాన్ని మరింతగా ఉధృతంగా చేపట్టాలని ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన నాయకులు నిర్ణయించారు. ఎస్ఐఆర్ అంటే ప్రజలకు అర్థం కాకపోవచ్చని, ఓట్ల చోరీ ప్రక్రియగా దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. పార్లమెంటు సమావేశాల 11వ రోజు (గురువారం) ఆందోళన కొనసాగించారు. నిరసనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పాల్గొన్నారు. 'ఎస్ఐఆర్-ప్రజాస్వామ్యంపై దాడి' బ్యానర్‌ను ప్రదర్శించారు. ఇద్దరు వ్యక్తుల చిత్రాలతో ఒకరి యూనిఫారంపై 'ఈసీ' అని రాసి... సంకెళ్లు వేసిన చేతుల్లో ఈవీఎంను పట్టుకొన్నట్లుగా చిత్రీకరించి... 'ఎస్ సర్' అని పక్కనే రాసివున్న కార్టూన్‌తో కూడిన ప్లకార్డులతో ఎంపీలు నిరసన తెలిపారు. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి ఈసీ పని చేస్తున్నదని, బీహార్ పరిణామాలు ఇందుకు అద్దం పట్టాయని విమర్శించారు. ఎస్ఐఆర్‌ను ఓట్ల చోరీ ప్రక్రియగా అన్ని భాషల్లో ప్రచారం చేయాలని నిర్ణయించారు.

5న కర్నాటకలో రాహుల్ ఆందోళన

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అధ్వర్యంలో కర్నాటకలో మంగళవారం ఆందోళన

- మిగతా 2 లో

ఏపీపీఎస్సీ 'ప్రిలిమ్స్' రద్దు

- ఒకే పరీక్షతో నియామకాలు
- ఖాళీల సంఖ్యకు 200 రెట్లు మించితేనే స్క్రీనింగ్
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించే పరీక్షల్లో కీలక మార్పులు చేసింది. ఇక నుంచి ఉద్యోగాల ఖాళీల భర్తీకి అభ్యర్థుల సంఖ్య 25 వేలు మించినప్పుడు ప్రాథమిక (స్క్రీనింగ్) పరీక్షలు నిర్వహించే విధానాన్ని ఏపీపీఎస్సీ రద్దు చేసింది. ఖాళీల సంఖ్యకు 200 రెట్లు మించితేనే స్క్రీనింగ్ పరీక్ష ఉండాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ చేసిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించింది. సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకాల్లో పారదర్శకత, వేగం, నాణ్యత పెరగనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పరీక్షల ఒత్తిడిని తగ్గిస్తూ, అవకాశాలను విస్తృతంగా అందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. వేగంగా ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టేందుకు ఏపీపీఎస్సీకి వెసులుబాటు

- మిగతా 2 లో

బీసీ బిల్లుకు బీజేపీనే అడ్డంకి

కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర- హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీసీ బిల్లుకు బీజేపీ పెద్ద అడ్డంకి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఓ వైపు బిల్లుకు అడ్డుపడుతూనే మరోవైపు ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బిల్లులను నాలుగు నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని, ఆర్డినెన్స్ ఆమోదం సైతం ఇదే విధంగా చేయడం సమంజసం కాదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం... బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ద్వంద వైఖరి అలంభిస్తోందని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సింధూర్‌పై పార్లమెంట్ ఒక్క సత్యం కూడా చెప్పడంలేదన్నారు. యుద్ధం తానే ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కనీసం ఖండించే ధైర్యం కూడా ప్రధాని మోదీ లేకుండా పోయిందన్నారు. వాస్తవాలను పార్లమెంట్ ముందు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఫిరాయింపుల చట్టాన్ని సమగ్రంగా సవరించాలి

ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ మూడు నెలలలోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, అయితే ఈ చట్టంలో లొసుగుల కారణంగా అది సాధ్యమా అని కూనంనేని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరు పార్టీ మారిన వారిపై తక్షణమే అనర్హత వేటు పడేలా చట్టాన్ని మరింత పటిష్టం చేయాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారించిన జస్టిస్ పి.సి.ఘోష్ ఏకసభ్య కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసిన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి సంబంధించి ఇటు బీజేపీ అటు బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధాన్ని కట్టిపెట్టి ... వాస్తవాలను కేసీఆర్ వెల్లడించి తమ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని సూచించారు.

19 నుంచి గాజుల రామారంలో సీపీఐ రాష్ట్ర మహాసభలు

సమసమాజమే లక్ష్యంగా ఆవిర్భవించి... త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాల్గవ మహాసభలు ఆగస్టు 19 నుంచి 21 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరుగుతాయని కూనంనేని తెలిపారు. మహాసభల ప్రాంగణానికి దివంగత 'ఎన్.బాలమల్లేష్ నగర్'గా నామకరణం చేసినట్లు చెప్పారు. వందేళ్ల ప్రస్థానంతో ముందుకు సాగుతున్న సీపీఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహా, మాజీ ఎమ్మెల్సీ

- మిగతా 2 లో

నీటిపారుదలశాఖ భూములు పరిరక్షిస్తాం

కబ్జాకు గురైతే ఉపేక్షించం

కాలువ పక్క భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్‌లు: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదలశాఖ భూముల పరిరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములు కబ్జాకు గురైన పక్షంలో ఎంత మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆక్రమణలకు గురైన భూములను యుద్ధ ప్రాతి పదికన స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూముల పరిరక్షణలో భాగంగా గురువారం అంబేద్కర్ సచివాలయంలో హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఆర్అండ్ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ అఫ్జల్ హుస్సేన్, ఈఎన్‌సీ అడ్మిన్ రమేష్ బాబు, డైరెక్టర్ జనరల్ అనిత,హైడ్రా ఎస్పీ అశోక్ సమీక్ష కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా హైదరాబాద్‌లోని గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలో ని గండిపేట సమీపంలోని హిమాయత్ సాగర్, కిస్మత్ పురలతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని

- మిగతా 2 లో

మరిన్ని సుంకాలు తప్పదు

భారత్, రష్యాకు ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్: భారత్ దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయడమే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. తాజాగా రష్యా, భారత్‌లను ఉద్దేశిస్తూ ఆయన మరోసారి అక్కసు వెళ్లగక్కారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదని గురువారం ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. కానీ, వారి ఆర్థిక వ్యవస్థను మరింత పతనం చేసుకుంటున్నాయని తెలిపారు. తాము భారత్‌తో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నామని, ఎందుకంటే అత్యధికంగా భారత్ సుంకాలు విధిస్తుందని ఆరోపించారు. రష్యా, అమెరికా కలిసి ఎలాంటి వ్యాపారం చేయట్లేదని ట్రంప్ వెల్లడించారు. తమతో వాషింగ్టన్ గేమ్ ఆడుతుందని, అది యుద్ధానికి దారితీయొచ్చని రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మద్వెదేవ్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ విరుచుకుపడ్డారు. ఆయన ఇంకా అధ్యక్షుడిననే భ్రమలో ఉన్నారని వ్యాఖ్యానించారు. దిమిత్రి చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తామని భారత్ సహా పలు దేశాలను ఇటీవల అమెరికా హెచ్చరించింది. ఇదే కారణాన్ని చూపుతూ భారత దిగుమతులపై 25 శాతం పన్నులతో పాటు పెనాల్టీలు కూడా విధించింది.

ఆరు భారత చమురు కంపెనీలపై ఆంక్షలు

భారత్‌కు చెందిన చమురు కంపెనీలపై ట్రంప్ సర్కార్ ఆంక్షలు విధించింది. ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోలు, మార్కెటింగ్ చేస్తున్నారనే అభియోగాలపై ప్రపంచవ్యాప్తంగా 20 సంస్థలపై వైట్‌హౌస్ చర్యలు తీసుకుంది. ఇందులో భారత్‌కు చెందిన 6 కంపెనీలు ఉన్నాయి. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటన విడుదల చేసింది. చమురు విక్రయాలతో నిధులు సమకూర్చుకొని మిడిల్ ఈస్ట్‌లో సంఘర్షణలు, అస్థిరతకు ఇరాన్ ఆజ్యం పోస్తుంది. సొంత దేశ ప్రజలతో పాటు ప్రపంచాన్ని అణచివేసేందుకు ఉగ్ర మూకలకు ఆర్థికంగా మద్దతు ఇస్తుంది. అందుకే టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడి తీసుకొచ్చేందుకు అమెరికా కఠిన చర్యలు తీసుకుంది. ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తుల వాణిజ్యంలో భాగస్వాములైన 20 కంపెనీలపై ఆంక్షలు అమలు చేస్తున్నామని అమెరికా ప్రకటించింది. అయితే, భారత్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, టర్కీ, ఇండోనేషియా దేశాలకు చెందిన కంపెనీలపైనా ఈ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు అమెరికా తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తులు కొనుగోలు చేయాలనుకునే వారు తమ ఆంక్షల ముప్పు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరింపులకు దిగింది. అంతేగాక, తమతో వాణిజ్యం చేసేందుకు అర్హత కోల్పోతారని అమెరికా హెచ్చరించింది.

పాక్‌తో చమురు ఒప్పందం

పాకిస్థాన్‌తో కలిసి చమురు నిల్వలు అభివృద్ధి చేయడానికి పనిచేస్తామని ట్రంప్ ప్రకటించారు. అంతేకాకుండా పాకిస్థాన్ ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మవచ్చని చెప్పుకొచ్చారు. 'పాకిస్థాన్‌తో మేము ఇప్పుడే ఒక ఒప్పందం చేసుకున్నాం. దీని ద్వారా పాకిస్థాన్, అమెరికా భారీ చమురు నిల్వలు అభివృద్ధి చేయడానికి కలిసి పనిచేస్తాయి. ఈ భాగస్వామ్యానికి నాయకత్వం వహించే చమురు కంపెనీని మేము ఎంచుకునే ప్రక్రియలో ఉన్నాము. బహుశా వారు ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మే అవకాశం ఉంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

రూ.12 కోట్ల బంగారం వరదపాలు

బీజింగ్: చైనాలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణం నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లోని ఉచి కౌంటీలో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే సిబ్బంది ఉదయం తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.12 కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలు వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

బీసీ బిల్లుకు బీజేపీనే అడ్డంకి

(మొదటి పేజీ తరువాయి)

పి.జె.చంద్రశేఖరరావు, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఇ. ఉమామహేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవితో కలిసి ఆవిష్కరించారు. గడిచిన మూడేళ్లలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకురావడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. తద్వారా 240 ఎంపీ సీట్లకు కట్టడి చేయడంలో విజయం సాధించామని చెప్పారు. సీపీఐ ఉద్యమాలతో రాష్ట్రంలో 75 శాతం పోడు భూముల సమస్య పరిష్కారమైందన్నారు. అసంఘటిత కార్మికుల వేతనాల పెంపు కోసం రాజీలేని పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. అధికార పార్టీతో ఉన్న స్నేహధర్మాన్ని పాటిస్తునే ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఉజ్జిని రత్నాకరం, డి.జి.సాయిల గౌడ్, బి.వెంకటేశం, పి.ప్రేమ్ పావని, ఆర్.అంజయ్య నాయక్, ఎం.ప్రవీణ్ కుమార్, దామోదర్, కె.ధర్మేంద్ర, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదలశాఖ భూములు పరిరక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వాలంతరి, టీజీఈఆర్ఎల్ కు చెందిన 426.30 ఎకరాలకు గాను 131.31ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. అందులో ఐ.టి.ఐ.ఆర్ అధీనం లో ఉన్న 81.26 ఎకరాల అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. 50.13 ఎకరాలు ఆక్రమణకు గురైందని ఆయన వివరించారు. ఆక్రమణ లపై జిల్లా కోర్టులో 20 కేసులు పెండింగ్ లో ఉండగా హైకోర్టు లో మరో రెండు కేసులు నడుస్తున్నాయన్నారు. న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొనేందుకు ప్రత్యేక సీనియర్ న్యాయవాదిని నియమించనున్నట్లు ఆయన వెల్లడించారు. కోటానుకోట్ల విలువ చేసే భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా, రెవెన్యూ,ఆర్అండ్ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. నీటిపారుదల క్వార్టర్స్ లో అక్రమంగా ఆక్రమించుకున్న వారిని తొలగించడం తో పాటు తక్షణమే వాటి సమగ్ర సమాచారం తన ముందుంచాలని మంత్రి ఆదేశించారు. ఆక్రమణకు గురైన అంగుళం భూమిని కూడా స్వాధీనం చేసుకోవడంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భవిష్యత్‌లోనూ ఆక్రమణలకు చోటు లేకుండా పరిపాలనా పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల కాలువల పక్కన ఉన్న భూముల్లో, సౌర విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై చర్చించామన్నారు. వీటి ద్వారా నీటిపారుదల ప్రాజెక్టులకు విద్యుత్ నందించవచ్చని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ 'ప్రిలిమ్స్' రద్దు

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతుంది. ప్రతి ఉద్యోగానికి ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు పరీక్షలు రాయాల్సిన అవసరం ఉండదు. తక్కువ సమయంలో ఎక్కువ ఉద్యోగ నియామకాలు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ -1, 2 పరీక్షలకు డిమాండ్ ఉంటుంది. గత ప్రభుత్వాల హయాం నుంచి ప్రిలిమ్స్ ద్వారా అభ్యర్థులను వడబోసి, ఆ తర్వాత మెయిన్స్ పరీక్షలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. గ్రూప్-1 మెయిన్స్‌లో నెగ్గిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఈ మూడంచెల విధానంతో ఖాళీల భర్తీ ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రశ్నాపత్రాల మూల్యాంకనంలో ఆరోపణలు నెలకొనడం వాటిపై న్యాయస్థానాల్ని ఆశ్రయించడం వెరసి ఏళ్ల తరబడి కొన్ని విభాగాల పోస్టులకు భర్తీకి నోచుకోలేదు. ఆయా పోస్టులకు అభ్యర్థులు ఎంపికైనప్పటికీ...న్యాయపరమైన చిక్కులతో ఉద్యోగాల్లో చేరడం ఆలస్యం అవుతోంది. ఇక నుంచి అలాంటి అవకాశాలకు చోటులేకుండా వేగవంతంగా నియామక ప్రక్రియలను పూర్తి చేసే క్రమంలో ప్రిలిమ్స్ పరీక్షలు రద్దు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. చాలా పోస్టుల నియామకాలకు ఇకపై ఒక్క మెయిన్స్ పరీక్షతోనే ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది. ఈ మార్పుల అమలుతో ప్రతి ఉద్యోగానికి ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు రాయాల్సిన అవసరం ఉండబోదు. ఒకే పరీక్ష ఆధారంగా ఎంపిక ప్రక్రియతో నిరుద్యోగులు ప్రతిసారీ పరీక్షలకు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. దానివల్ల వారికి డబ్బుల ఆదా అవుతుంది. ప్రస్తుతం ఉన్న దాని కంటే ఇది సులభమైన, వేగవంతమైన విధానంగా భావిస్తున్నారు.

చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు!

(మొదటి పేజీ తరువాయి)

సింధూ జలాల ఒప్పందం రద్దుతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. 1,856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చుకు అంచనా ఉంది. రెండు దశల్లో ప్రాజెక్టు నిర్మించనున్నారు. జమ్మూకశ్మీర్ ప్రభుత్వం దశాబ్దం క్రితమే దీనిని మొదలుపెట్టి కొంత ఖర్చు చేసింది. 2021లో కేంద్రం జోక్యం, ఎన్‌హెచ్‌పీసీని భాగస్వామ్యంతో పాటు కీలక ఒప్పందాలు చేసుకుంది. అంతర్జాతీయ బిడ్డింగ్‌కు అడ్డంకులు తొలగించే చర్యలు చేపట్టింది. పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయింది.

మోదీ మౌనం ఇంకెంత కాలం

- ట్రంప్ నిరాధార ఆరోపణలపై ఖర్గే నిలదీత
- ఆర్థిక వ్యవస్థ క్షీణతపై ఆందోళన

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై చేసే నిరాధార ఆరోపణలపై ప్రధాని మోదీ మౌన దీక్ష ఇంకెంత కాలం అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పీఆర్ (ప్రచారం) గురించి కాకుండా దేశం గురించి ఆలోచించాలని మోదీ ప్రభుత్వానికి హితవు పలికారు. దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని తెలియదా అంటూ నిలదీశారు. భారత ఆర్థిక వ్యవస్థను బీజేపీ పతనం చేసిందని ప్రపంచం మొత్తానికి తెలుసని ఎద్దేవా చేశారు. ఇది జరిగింది కేవలం అదానీకి సాయం చేయడానికే అంటూ ఖర్గే వ్యాఖ్యానించారు. అమెరికా సుంకాలు, జరిమానా విధించడం, రష్యాతో వాణిజ్యంపై ఆరోపణలు చేయడంతో కాంగ్రెస్ అధ్యక్షుడు బుధవారం స్పందించారు. పాక్- భారత్ మధ్య కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటనలను ఖండించకుండా, పార్లమెంటులో మోదీ మౌనదీక్ష కొనసాగించారని విమర్శించారు. కలిసి చావమనండి అంటూ భాతర్-రష్యా ఆర్థిక వ్యవస్థలపై ట్రంప్ అక్కసు, 25 శాతం సుంకం ప్రకటించడం, రష్యాతో వాణిజ్యంపై జరిమానా విధించడంతో ఖర్గే మండిపడ్డారు. భారత్‌పై ట్రంప్ నిరాధార ఆరోపణలు చేస్తుంటే మోదీ మౌనం పాటిస్తున్నారా? ఇది ఇంకెంతకాలం? అంటూ ప్రశ్నించారు. భారత్‌పై ట్రంప్ 25 సుంకంతో పాటు జరిమానా విధించడం దేశ వాణిజ్యానికి హానికరమని, దీంతో ఎంఎస్‌ఎంఈలు, రైతులపై తీవ్ర ప్రభావం ఉంటుందని, అనేక పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోతాయని ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. 'అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నట్లు మీ మంత్రులు కొన్ని నెలలుగా చెబుతున్నారు. ఇందుకోసం కొందరు వాషింగ్టన్‌లో కొంతకాలం గడిపారు. ఇలాగేనే మీ మిత్రుడు వ్యవహరించేది. మీ దోస్తీకి 'నమస్తే ట్రంప్', 'అబ్ కి బార్ ట్రంప్ సర్కార్' కోసం దేశం మూల్యం చెల్లించుకుంటోంది' అని ఖర్గే మండిపడ్డారు. రష్యా నుంచి చమురు, ఆయుధాల కొనుగోలు, భారత్ బ్రిక్స్ సభ్యదేశంగా ఉండటం, డాలర్‌పై బ్రిక్స్ దాడి అంటూ భారత్‌పై ట్రంప్ ప్రతీకారం తీర్చుకుంటున్నారా అని ప్రశ్నించారు. తాజా పరిణామం భారతదేశ జాతీయ విధానం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి దెబ్బతింటుందని ఖర్గే హెచ్చరించారు. విదేశాంగ విధానానికి మూలం తటస్థ వైఖరి అని, ఇందుకు దేశ చరిత్రే సాక్ష్యమని చెప్పారు. కేంద్రంలో ఏ పార్టీలో అధికారంలో ఉన్నాగానీ భారత ప్రయోజనాల దృష్ట్యా ప్రపంచ దేశాలతో స్నేహ సంబంధాల బలోపేతానికి కట్టుబడ్డాయని ఖర్గే గుర్తుచేశారు. యూపీఏ ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అమెరికా సహా 45 దేశాలతో అణు ఒప్పందం జరిగిందని, అమెరికా తన చట్టాన్ని సైతం మార్చుకొని భారత్‌కు మద్దతు ఇచ్చిందని చెప్పారు. అణు ఇంధనం, సామగ్రిని కేవలం అమెరికా నుంచే తీసుకోవాలని అప్పట్లో ఆంక్షలు లేవని, ఇతర అవకాశాలు భారత్‌కు ఉన్నాయని ఖర్గే గుర్తుచేశారు. 'మీ (మోదీ) ప్రభుత్వంలో విదేశాంగ విధానం వల్ల జాతీయ విధానం దెబ్బతింటోంది. చమురు నిల్వలపై పాకిస్థాన్‌తో ఒప్పందం గురించి ట్రంప్ మాట్లాడుతున్నారు. భారత్‌ను బెదిరిస్తున్నారు. దీనిపై మీరు మౌనంగా ఉంటారా?' అని ఖర్గే ప్రశ్నించారు. అమెరికా-చైనా- పాకిస్థాన్ మధ్య కొత్త బంధం తమను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు.

నిందితులకు విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బైక్‌కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఆధారాల్లేవ్. ఉగ్రవాదానికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు' అని కోర్టు తెలిపింది. ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది. తీర్పుపై మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు కారణంగా 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనమైందన్నారు. మరోవైపు, ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి.

ఐదేళ్ల కనిష్ఠానికి పసిడి డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

సచిన్ జైన్ తెలిపారు. ధరలు స్థిరంగా ఉంటే ఈ ఏడాది డిమాండ్ 700 టన్నుల వరకూ ఉండొచ్చన్నారు. భౌగోళిక, రాజకీయ అంశాల ప్రభావంతో అది సాధ్యం కాకపోవచ్చన చెప్పారు.

ముంబైకి సిట్ బృందం

మద్యం కుంభకోణంపై ముమ్మర దర్యాప్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా ముంబైకు సిట్ బృందం వెళ్లింది. ఇప్పటికే ఈ కేసులో నిందితుడు వరుణ్ ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్ శివారులోని శంషాబాద్ సమీపంలో రూ.11 కోట్ల నగదు సీజ్ చేశారు. మరిన్ని నగదు డంపింగ్ యార్డులు ఉన్నాయనే దిశగా సిట్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. షెల్ కంపెనీలకు డబ్బులు మళ్లించారన్న ఆరోపణలతో సిట్ బృందం ముంబై వెళ్లింది. అక్కడ షెల్ కంపెనీలను పరిశీలించి, ఆ తర్వాత నివేదికలను సిద్ధం చేయనుంది. ఈ కేసులో మరింత సమాచారం కోసం ప్రయత్నిస్తున్నారు. సీజ్ చేసిన నగదు మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని సిట్‌ను ఏసీబీ కోర్టు గురువారం ఆదేశించింది. విజయవాడ ఎస్‌బీఐ మాచవరం శాఖలో నగదు డిపాజిట్ చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి గెలవడంతో... ఈ కేసుతో ప్రమేయమున్న అనేక మంది విదేశాలకు వెళ్లిపోయారు. వారిని సైతం వెనక్కి తీసుకు వచ్చేందుకు సిట్ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.3,500 కోట్ల మేర మద్యం కుంభకోణం జరిగినట్లు దర్యాప్తులో తెలింది. అందులో రూ.11 కోట్లపైనా దృష్టి పెట్టారు. మద్యం కుంభకోణంలో ప్రమేయమున్న రాజ్ కేసిరెడ్డి, గోవిందప్ప బాలాజీతోపాటు మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌తోపాటు విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. సిట్ అధికారులు వారిని విచారించారు. వాటి ఆధారంగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సిట్ సీజ్ చేసిన రూ.11 కోట్లు కేసిరెడ్డికి సంబంధించినదిగా కట్టుకథలు అల్లుతున్నారంటూ వైసీపీ నేతలు తప్పుపడుతున్నారు.

3 నెలల్లో స్పీకర్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని అభిప్రాయపడింది. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారని, ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు పరిమితంగా ఉన్నాయన్నారు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసిందని, స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో స్పష్టం చేసింది. స్పీకర్ అలా వ్యవహరిస్తూనే రాజ్యాంగ పరమైన రక్షణని పొందలేరంది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014లో తీర్పును పక్కన పెడుతున్నామని, ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు కాబట్టి, ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉందని చెప్పింది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని, ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ నోటీసు జారీ చేయడం దురదృష్టకరమని పేర్కొంది. ఆపరేషన్ సక్సెస్-పేషెంట్ డైడ్' అన్న సూత్రం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

మా జోక్యానికి పరిమితి ఉంది: జంధ్యాల రవిశంకర్-సీనియర్ న్యాయవాది

అనర్హత పిటిషన్‌లపై గతంలో ఎలాంటి తీర్పులు ఉన్నా ...ధర్మాసనం ఈ రోజు స్పష్టత ఇచ్చిందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రవిశంకర్ అన్నారు. అనర్హతపై సుప్రీం కోర్టు నిర్ణయం తీసుకోదు ,స్పీకరే తీసుకోవాలి అని చెప్పారని పేర్కొన్నారు. ఈ కేసులో సుమారు 50 పేజీలతో తీర్పు కోర్టు వెలువరించిందని, స్పీకర్ సుదీర్ఘకాలం పెండింగ్ లో ఉంచకూడదని సూచించిందన్నారు. అసెంబ్లీ లోపల వ్యవహారాలకు ప్రజాప్రతినిధ్య చట్టంలోని నిబంధనలకి తేడా ఉందని, అసెంబ్లీ లోపల వ్యవహారాలపై మా జోక్యానికి పరిమితి ఉందని ధర్మాసనం చెప్పిందన్నారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం: బీఆర్ఎస్ న్యాయవాది

అనర్హ త పిటిషన్లపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని బీఆర్ఎస్ తరపు న్యాయవాది మోహిత్ రావు తెలిపారు. విచారణకు ఎమ్మెల్యేలు సహకరించకపోతే స్పీకర్ తగువిధంగా స్పందించే అవకాశం ఉందన్నారు. తాము ఏదైతే వాదించేమో అది సుప్రీంకోర్టు తీర్పులో వచ్చిందన్నారు. రోజువారిగా చేస్తే మూడు నెలల్లో విచారణ ప్రక్రియ ముగుస్తుందని, మూడు నెలలకు మించి సమయం కావాలి అంటే అందుకు తగిన సాక్ష్యాధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు.

సాంకేతిక సాకులతో స్పీకర్ అడ్డుకట్ట వేయవచ్చు...

సాంకేతిక సాకులతో స్పీకర్ అడ్డుకట్ట వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోర్టులో తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని... కేవలం మర్యాదపూర్వకంగా సీఎంను కలిశామంటూ పలువురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు అఫిడవిట్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిరాయింపుల చట్టం తమకు వర్తించదని ఈ ఎమ్మెల్యేలు వాదిస్తున్నారు. మూడు నెలలకు మించి స్పీకర్ జాప్యం చేసిన పక్షంలో మళ్లీ సుప్రీంకోర్టు తలుపు తట్టే అవకాశమే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. ఎమ్మెల్యేలు... పార్టీ మారినట్లుగా సాంకేతిక ఆధారాలు సమర్పించాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉంది. అది అంత సులువు కాదని ఆ పార్టీ ప్రముఖులు భావిస్తున్నారు. ఇక్కడ రాజీనామా చేసి... అక్కడ సభ్యత్వం తీసుకున్నట్లు ఆధారాలు లేవు కాబట్టి నిరూపించడం కష్టమనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. తగిన ఆధారాలు లేకుండా నిర్ణయం తీసుకోలేమని స్పీకర్ పెండింగ్‌లో కూడా పెట్టవచ్చని... సుప్రీంకు వివరణ కూడా ఇచ్చుకోవచ్చని... ఇలాంటి పరిస్థితిలో తమకు అనుకూలంగా స్పీకర్ నిర్ణయం ఉంటుందని భావించలేమని గులాబీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

న్యాయ నిపుణులను సంప్రదించి నిర్ణయం: స్పీకర్

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. 'కోర్టు తీర్పు కాపీ ఇంకా చూడలేదు. చూసిన తర్వాత స్పందిస్తా. ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. సుప్రీంకోర్టు ఆదేశాలపై న్యాయ నిపుణులను సంప్రదించి అధ్యయనం చేస్తాం. ఆ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు.

విభజన-విద్వేషమే రాజకీయ పంథా

(మొదటి పేజీ తరువాయి)

కలవకూడదని అక్కడి యంత్రాంగం పదేపదే ప్రయత్నించిందన్నారు. బలవంతంగా మతమార్పిడి చేశారని, ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లారని అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలంటూ గిజరన యువకులు, ముగ్గురు బాలికలపై బజరంగ్ దళ్ గూండాలు భౌతిక దాడి చేశారని వెల్లడించారు. ఇద్దరు సన్యాసినులను విడుదల చేయాలని కేరళలో వాణి వినిపిస్తూ, వారి పార్టీ అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్‌లో మాత్రం తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని, దీంతో బీజేపీ నిజ రూపాన్ని బహిర్గతమని అనీరాజా వ్యాఖ్యానించారు. క్రైస్తవులు, మతపరమైన సంప్రదాయాలపై బీజేపీ దాడి చేయడం సిగ్గుచేటని సునీర్ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మణిపూర్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో మైనారిటీలపై దురాగతాలు పెరిగాయన్నారు. ఘటన జరిగిన వెంటనే సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్, అనీరాజా చత్తీస్‌గఢ్ వెళ్లి రాయ్‌పూర్ ఆర్చ్‌బిషప్ విక్టర్ హెన్రీ ఠాకూర్‌ను కలిసి, పార్టీ తరపున సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపినట్లు వెల్లడించారు. ఇద్దరు నన్స్‌తో పాటు జైల్లో మగ్గుతున్న గిరిజన యువతను తక్షణమే విడుదల చేయాలని, వారిపై అక్రమ కేసులు కొట్టివేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, వారిపై వేధింపులు, వివక్షకు వ్యతిరేకంగా పార్లమెంటుతో పాటు వీధుల్లోనూ సీపీఐ గళం వినిపిస్తుందని అనీరాజా, సునీర్ వెల్లడించారు.

ఓట్ల చోరీకే ఎస్ఐఆర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. వచ్చే వారంలో ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట ధర్నా, ముట్టడికి ఉన్న అవకాశాలను 'ఇండియా' పరిశీలిస్తోందని, బీహార్‌లోనూ 'ఓట్ల చోరీ' పేరిట భారీ ఆందోళనకు కసరత్తు చేస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇచ్చే విందు సందర్భంగా ఎస్ఐఆర్‌పై ఇండియా ఐక్య సంఘటన నాయకులకు రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపాయి. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా వేరుగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సర్కారు మాట తప్పినందునే...

కేంద్రప్రభుత్వం ఇచ్చిన మాట తప్పినందునే ఎస్ఐఆర్‌పై తమ ఆందోళనను మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రతిపక్షాలు నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పార్లమెంటులో ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతి ఇవ్వని కారణంగా ఆందోళనలను ఉధృతం చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదని తెలిపాయి. ఎన్నికల అధికారులు అనేక రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ కోసం ఏర్పాట్లు ప్రారంభించిన నేపథ్యంలో పోరు తీవ్రతరం చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయని పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్‌పై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎస్ఐఆర్ విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పి... ప్రభుత్వం మాట తప్పిందని ఇండియా నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

'ఇండియా' భేటీ

రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన 'ఇండియా' నాయకులు రాహుల్, డెరెక్ ఓ బ్రెయిన్ (టీఎంసీ), పి.సంతోశ్ కుమార్ (సీపీఐ), కె.రాధాకృష్ణన్ (సీపీఎం), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం) తదితరులు భేటీ అయ్యారు. ఎస్ఐఆర్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. అమెరికా 25 శాతం సుంకం, జరిమానా విధించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని వామపక్షాల నాయకులు సూచించారు. అయితే ఎస్ఐఆర్‌పై సర్కారుకు తప్పించుకునే అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించారు. ఎస్ఐఆర్ కంటే కూడా ఓట్ల చోరీ ప్రక్రియగా దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎవరి భాషల్లో వారు 'ఓట్ల చోరీ'ని అనువదించి... ఎస్ఐఆర్ వ్యతిరేక ఆందోళనలు చేపట్టాలని సమావేశం సూచించింది. ఎస్ఐఆర్‌పై చర్చ విషయంలో ప్రభుత్వ వైఖరి ఆధారంగా ఈసీ ఎదుట ఆందోళనపై నిర్ణయం ఉంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

ఐపీఎస్ సంజయ్‌కు సుప్రీం షాక్

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. గత విచారణ సందర్భంగా సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు... ఇదెలా సాధ్యమని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలా అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

కేసు నేపథ్యం...

'అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరపున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించక పోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.రెండు కోట్ల మేర నష్టం కలిగించారు' అని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది.

క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: షెడ్యూలు ప్రకారం క్షేత్ర స్థాయిలో వైద్య కార్యక్రమాలు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను, ఆరోగ్య సర్వే, నివేదికలను పరిశీలించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సెంటర్ పరిధిలోని సిబ్బంది ప్రతిరోజూ ప్రతి ఇంటికి తిరుగుతూ ఆరోగ్య సర్వే నిర్వహించి, వారి వివరాలను సేకరించాలని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా, ఆహారం తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్ న్యూట్రిషన్‌లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే జిల్లాలో ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షించి నివేదికలను కోరడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ వెంట స్థానిక వైద్య అధికారి డాక్టర్ సాగర్, జడ్.పి.హెచ్.ఎస్ ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

విద్యారంగ బలోపేతానికి చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి, క్లాసు రూమ్‌లను పరిశీలించి విద్యార్థినిలతో తెలుగు, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల వారీగా వివరాలు అడిగి తెలుసుకొని, తెలుగు, ఇంగ్లీష్‌పై పట్టు ఉండాలని, విద్యార్థులతో తెలుగు చదివించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, డిజిటల్ క్లాసు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. 3 వ తరగతి విద్యార్థిని డిజిటల్ స్క్రీన్ లో ఇంగ్లీష్ పదాలను చదువుతుండగా కలెక్టర్ వీక్షించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జ్వరంతో వచ్చిన ప్రతి వ్యక్తికి మలేరియా, డెంగ్యూ రక్తపరీక్షలను నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పసర వైద్యాధికారిణి డాక్టర్ సుహానాను ఆదేశించారు ఈ సందర్భంగా కలెక్టర్ ల్యాబ్ టెక్నీషియనుతో రూమును మలేరియా, డెంగ్యూ ఆర్డిటి పరీక్షలకు సరిపడా టెస్టు పరికరాలు, ల్యాబ్ రియేజెంట్ ఉన్నాయా అడిగి తెలుసుకుని లేనియెడల సమకూర్చుకోవాలని లాబ్ టెక్నీషియన్కు తెలిపారు. పస్ర వైద్యాధికారిణి డాక్టర్ సుహానా, ఫార్మసిస్ట్ శారద, స్టాఫ్ నర్సులు సంధ్య, రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన రావుల

విశాలాంధ్ర - వనపర్తి : బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ ఎం.పి, మాజీ ఎం.ఎల్.ఏ గౌరవ రావుల చంద్రశేఖర్ రెడ్డి వనపర్తి పట్టణములో విస్తృతంగా పర్యటించారు. మాజీ మార్కెట్ చైర్మెన్ గౌనీ బుచ్చిరెడ్డి కుమారుడు ఓం ప్రకాష్ రెడ్డి వివాహం సోనీతో ఆర్.జి. గార్డెన్లో జరిగింది. మారం అనిత బాలకృష్ణ కుమార్తె నికిత వివాహం జయదీప్‌తో కళ్యాణ సాయి గార్డెన్స్ నందు జరిగింది. ఇట్టి వివాహాలకు రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. బి.ఆర్.ఎస్ పార్టీ విద్యార్థి నాయకులు లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్ కుమారుల డోలారోహణ (తొట్లే) కార్యక్రమం జరిగింది. వారి స్వగృహానికి రావుల చంద్రశేఖరరెడ్డి వెళ్లి చిన్నారులు పుష్పాల రాజగోపాల్ గౌడ్, హరిగోపాల్ గౌడ్‌ను ఆశీర్వదించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా బి.ఆర్.ఎస్ నాయకులు గంధం బాలపీరు మనుమరాలు ఓంకైరా మొదటి పుట్టినరోజు సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి తల్లిదండ్రులు కొప్పుల భావన వాసుదేవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. రావుల వెంట పలుస.రమేష్ గౌడ్, వాకిటి.శ్రీధర్, నందిమల్ల అశోక్, పెబ్బేరు.రాజశేఖర్, అఖిల్ చారీ, ఎద్దుల.సాయికుమార్, ఉంగ్లం. తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, జాత్రు నాయక్, నందిమల్ల.రమేష్, ఎం.డి.గౌస్, యుగంధర్ రెడ్డి, వహీద్ ఉన్నారు.

గంగాయిపేటలో అన్నదానం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ గట్మనేని బాబూరావు జన్మదిన సందర్భంగా బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో మండలంలోని కుగ్రామం గంగాయిపేటలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత అధ్యక్షుడు లయన్ సాదుల వెంకటస్వామి మాట్లాడుతూ ప్రపంచంలో అన్నదానాన్ని మించిన దానం లేదని అన్నారు. తోటి వారి ఆకలి తీర్చటం కంటే గొప్ప విషయం మరొకటి లేదని, ఈ ఉద్దేశ్యంతోనే బాబూరావు ప్రతి సంవత్సరం వందకు పైగా క్లబ్బుల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యదర్శి రాఛమల్ల రాజశేఖర్, కోశాధికారి పీసర రాంచందర్, డి.సిలు పాలెపు సుదర్శన్, అయిల్నేని సంజీవరావు, డైరెక్టర్ మహాజన్ జితెందర్ పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అధికారులు జవాబుదారీగా ఉండాలి

సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ అయోధ్య రెడ్డి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ప్రజలకు ప్రాథమిక హక్కుగా ఉన్న సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. ప్రజల హక్కులను కాపాడటానికి ప్రజలకు, ప్రభుత్వానికి అధికారులు జవాబు దారితనంగా, వారధిలా నిలువాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రధాన కమిషనర్ అయోధ్య రెడ్డి, సహ కమిషనర్లు దేశాల భూపాల్, పి.వి.శ్రీనివాస్‌రావు గురువారం జిల్లాకు వచ్చారు. కమిషనర్లకు ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా ట్రైని కలెక్టర్ సౌరబ్ శర్మలు పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధాన కమిషనర్ అయోధ్య రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఐ డి ఓ సి కార్యాలయం ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కమిషనర్లు మొక్కలు నాటారు. ఐడిఓసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్.టి.ఐ యాక్ట్ అమలు విధి విధానాలపై క్షుణ్ణంగా పౌర సమాచార అధికారులకు అవగాహన సదస్సు అనేక సూచనలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అయోధ్య రెడ్డి మాట్లాడుతూ ఆర్టీఐ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా కొత్తగూడెం జిల్లాకు రావడం జరిగిందన్నారు. సమాచార హక్కు చట్టం 136 దేశాల్లో అమలు అవుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టీఐ సమర్థవంతంగా అమలవుతుందని కొనియాడారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టంలోని సెక్షన్లు, సబ్ సెక్షన్‌లపై పౌర సమాచార అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ చట్టం అమలులో ప్రపంచంలోనే భారతదేశం 8వ స్థానంలో ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబు దారితనం ఎంత అవసరమో పారదర్శకత కూడా అంతే అవసరమన్నారు. గత పది ఏళ్ళ కాలంలో సమాచార కమిషనర్ అందుబాటులో ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషనర్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో పెండింగ్లో ఉన్న కేసులను పూర్తిగా పరిష్కరించి కొత్త దరఖాస్తుల ద్వారా ముందుకు వెళ్ళబోతున్నామని చెప్పారు. సరైన కారణాలు చూపించకుండా ఆర్టీఐ యాక్ట్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సదస్సులో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యే అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులకు దీనిపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా పౌర సమాచార అధికారులకు చట్టంపై ఉన్న సందేహాలను కమిషనర్లు నివృత్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు మధు, దామోదర్, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకువెళ్లాలని డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ డిపిఆర్ఓ కార్యాలయంలో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ, టీం లీడర్లు కామీరే వెంకన్న, గిద్దె రాంనర్సయ్య, మెరుగు రవీందర్ గౌడ్‌లతో కలిసి డిపిఆర్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నందున వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకువెళ్లే గురుత్వర బాధ్యత ప్రభుత్వ సాంస్కృతిక సారథి సభ్యులపై ఉందని ఆయన అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం, రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి, 500 కే గ్యాస్ పంపిణీ, సన్న బియ్యం, రేషన్ కార్డుల, పంపిణీ, ఇందిరా జల గిరి వికాసం, స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ, మహిళలకు పెట్రోల్ పంపులు నిర్వహణ, ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ, తదితర 6 గ్యారంటీల పథకాలు ద్వారా ప్రజలు ఎంతో ఉపయోగపడటం జరుగుతుందన్నారు. కె.రాము, సాంస్కృతిక సారథి సభ్యులు బండ వెంకన్న, ఐలేష్ కుమార్, భరత్, దర్శనం యుగంధర్, సురేష్, దప్పు శ్రీను, నరేష్, ప్రవీణ్, గౌరారపు యుగేందర్, బక్కీ యాది, కందుకూరి అనిల్, పరమేష్, పాష, కవిత, రోజా, రాజ్యలక్ష్మి, అశ్విని, సింధుజ, కీర్తి పాల్గొన్నారు.

దిర్శించర్ల ఊర చెరువుకు ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల సర్వే నెంబర్ 52లో ఉన్న ఊర చెరువును, ప్రతి సంవత్సరం కొంత మట్టి పోసి చెరువు ఆక్రమణ చేసి పొలాలను చేసుకుంటున్న 27 మంది ఆక్రమణదారుల నుండి, 50 ఎకరాల విస్తరణలో చెరువు ఆక్రమణను, తహసీల్దార్ సైదులు, ఇరిగేషన్ డిఈ ఈ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పంట పొలాలు తీసివేసి, హద్దులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈ ఈ శ్రీనివాస్, ఏఈ ఈ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ రాము, గ్రామ రైతులు పాల్గొన్నారు.

100 మొక్కలు నాటిన 50 మంది చిన్నారులు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : దేశవ్యాప్తంగా జమాతే ఇస్లామీ హింద్ ప్రోత్సాహంతో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 50 మంది చిన్నారులు 100 మొక్కలు నాటారు. గురువారం ఈ కార్యక్రమానికి జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు షెహనాజ్ సారథ్యం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు ప్రకృతిలో ఎంత ప్రాముఖ్యత కలిగి ఉన్నాయో ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) 15 వందల ఏళ్ళ క్రితమే బోధించాలని తెలిపారు. ఇస్లాంలో మొక్కలకు, పర్యావరణ పరిరక్షణకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటి సంరక్షించాలని షహనాజ్ పిలుపునిచ్చారు. మనం నాటిన నేటి మొక్కలు భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగి మన భావితరాలను సంరక్షిస్తాయని అన్నారు. పిల్లలకు చిన్నవయసు నుంచే మొక్కల నాటి పెంచే అలవాటును పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవాసమితి సెక్రటరీ మునీల మాట్లాడుతూ చిన్నారుల ఆర్గనైజేషన్ దేశవ్యాప్తంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో జెఐహెచ్ బాధ్యులు షబానా, రజియా, మల్లికా, షాహిదా, మహిబు, సత్యావతి, రాముడమ్మా, లక్ష్మి, సీత, రమ, సబిహా తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం హర్షణీయం

విశాలాంధ్ర - ఖమ్మం : ఫీల్డ్ అసిస్టెంట్ల కు ఉద్యోగ భద్రత కల్పించాలి. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధి హామీల్లో చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాష్ట్రవ్యాప్తంగా తొలగించి రాక్షస ఆనందం పొందిందని అట్టి ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి ఉద్యోగంలో తీసుకుంటామని, అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లుకు వ్యక్తిగత గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యం కనిపిస్తామని నిన్న జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హామీ ఇవ్వడం హర్ష దాయక విషయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా సమితి తెలిపింది. జిల్లా కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 2005 నుండి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత గతంలో వేతనాలు పెంచాలని పని భారం తగ్గించాలని అడిగినందుకు వారిపై అక్రమ కేసులు పెట్టి వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం జరిగిందని వారికి అండగా సిపిఐ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బి కే యం యు ఆధ్వర్యంలో అనేక ఆందోళనలో పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీ మేరకు వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని వారి సమస్యల పరిష్కరిస్తామని మంత్రి సీతక్క ప్రకటించటం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పోరాడితేనే ఏ సమస్య అయినా పరిష్కారం అవుతుందన్నారు. బి కే ఎం యు ఆధ్వర్యంలో మీ సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని మీకు ఎల్లప్పుడూ బి కే యం యు అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ, పిట్టల రాంబాబు, మేళ్లచెరువు వీరబాబు, సాహయ కార్యదర్శి కంపసాటి వెంకన్న, బత్తిని సీతారాములు, గోగుల అది, చీనా, అయోధ్య, జిల్లా నాగరాజు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ నిధులు విడుదలకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఖమ్మం : గోదావరి జలాలు పాలేరు రిజర్వాయర్ అనుసంధానం కోసం దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర మంత్రి వర్గం సవరించిన అంచనాల ఆమోదం తోపాటు నిధులు విడుదల కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఖమ్మం అర్బన్ రైతు సమావేశం లో రాంబాబు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం 2916 లో రూ 13,0057 కోట్ల రూపాయలు అంచనాతో సీతారామ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం చేయడం జరిగింది అని నేడు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి 19,325 కోట్ల రూపాయలు ఖర్చు అంచనా పెంచి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది అని, నిధులు మాత్రం 2025-26 బడ్జెట్లో కేటాయింపులు 665 కోట్ల రూపాయలు మాత్రమే అని అన్నారు, పెంచిన అంచనా 6,268 కోట్ల రూపాయలు అని, కేటాయింపులకి, పెరిగిన ఖర్చు అంచనాకి భూమికి, ఆకాశంకు మధ్య ఉన్న దూరం అంతా ఉందని అన్నారు. సవరణ అంచనాల ఆమోదం తోపాటు నిధులు కేటాయింపులు కూడా పెంచాలని డిమాండ్ చేశారు, గత 2024 ఆగస్టు 15 వైరా రైతు సంబరాల సభలో రాష్ట్ర ముఖ్య మంత్రి 2026 ఆగస్టు 15 నాటికి సీతారామ పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాల సాగు భూములకు నీరు అందిస్తామని ప్రకటించారు అని గుర్తు చేశారు, ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవడం కోసం, రైతులు ప్రయోజనాలు కోసం రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయుటకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మీరా, అర్బన్ రైతు సంఘం మండల అధ్యక్షులు ఎర్రబోయిన గోవిందరావు, వెంకయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : భవిష్యత్తు తరాల బాగును దృష్టిలో ఉంచుకొని వనమహోత్సవం కింద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటడం తప్పనిసరి అని, రానున్న తరాలు కాలుష్యం బారిన పడకుండా ఉండేందుకు చెట్లే ఆధారమని, అందువల్ల ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని చెప్పారు. వనమహోత్సవం కింద జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని, ప్రత్యేకించి ఆయా శాఖలు వాటి కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వర్షాకాలం పూర్తయ్య లోపే మొక్కలు నాటడం పూర్తి చేయాలని, ఇందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మంత్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నల్గొండ మండలం, వెలుగుపల్లి గ్రామానికి చెందిన రిషికేశ్ పిడుగుపాటుకు మరణించగా వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తదితరులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాబీర్ పాషాకు పలువురి సత్కారం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన ఎస్‌కే. సాబీర్ పాషాను పలువురు ప్రముఖులు ఆత్మీయంగా సత్కరించారు. కొత్తగూడెం ఓల్డ్ డిపో సమీపంలోని ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురేషి కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ ఖలీల్, డాక్టర్ ఖదర్ సాబీర్ పాషాకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఉర్దూఘర్ చైర్మన్ డాక్టర్ నయీమ్ ఖురేషి మాట్లాడుతూ సిపిఐ పార్టీ అభివృద్ధికి జిల్లాలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి కార్యదర్శి పదవిలో నియమించడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తోపాటు జిల్లా నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సాబీర్ పాష కేవలం తన పార్టీ వారికే కాకుండా రాజకీయాలకు, కుల మతాలకతీతంగా పేద ప్రజలకు, అవసరార్థులకు ఏ సమస్య వచ్చిన ముందుండి ఆదుకుంటారని కొనియాడారు. ఆయన మరింత ఉన్నత స్థానానికి ఎదిగి నూరేళ్లు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ఖురేషి తోపాటు డాక్టర్లు ఖలీల్, ఖాదర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ వసీం, సీనియర్ జర్నలిస్ట్ ఎంఏ. వహాబ్ పాల్గొన్నారు.

పాల్వంచ ఆవిష్కృత సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదం

విశాలాంధ్ర - కొత్తగూడెం : పాల్వంచలో చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలు ఆమోదించడం జరిగిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం తెలిపారు. జూలై 26, 27 రెండు రోజులు అశ్వారావుపేటలో జరిగిన సీపీఐ జిల్లా 3వ మహాసభల్లో ఎన్నుకున్న జిల్లా కమిటీలో పాల్వంచకు సముచిత స్థానం దక్కినట్లు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్ లో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కమిటీలో తనతోపాటు పాల్వంచ నుండి జిల్లా కార్యవర్గ సభ్యులుగా ముత్యాల విశ్వనాథం, ఉప్పుశెట్టి రాహుల్, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావులను ఎన్నుకోవడమే కాకుండా కౌన్సిల్ సభ్యులుగా బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, డీ. సుధాకర్, వీ. పద్మజ, వరక అజిత్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని విశ్వనాథం సంతోషం వ్యక్తం చేశారు. ఈ మహా సభలలో పాల్వంచ కేంద్రంగా కేటీపీఎస్ లో 800 మెగావాట్ల నూతన స్టేజీలను ఏర్పాటు చెయ్యాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఎరువుల కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని, పాల్వంచ మున్సిపాలిటీకి కార్పొరేషన్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని తీర్మానాలు ఆమోదించినట్లు వెల్లడించారు. అదేవిధంగా కాలుష్య ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, ఇక్కడి స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని ఉత్పత్తిలోకి తీసుకురావాలని, పాల్వంచ కేంద్రంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాలని తదితర 49 తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. మహాసభల స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూనే రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో శాశ్వత పరిష్కారాలకు కృషి చేస్తామని తెలిపారు. సీపీఐ నాయకులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, సుధాకర్, పద్మజ, వరక అజిత్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమించిన షెడ్ తొలగించాలి

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలం పట్టణంలో కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా గ్రామపంచాయతీ ద్వారా ఫుట్ పాత్ స్థలంలో పబ్లిక్ టాయిలెట్స్ కాంప్లెక్స్ ను నిర్మాణం చేసారు. దీనికి సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని ఫుట్ పాత్ కబ్జా చేసి షెడ్ నిర్మాణానికి పాల్పడుతున్న వారిని తక్షణమే చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ జేఏసీ ప్రెసిడెంట్ శంకర్ తొపాటు వివిధ సంఘాల నాయకులు గురువారం ఈవో శ్రీనివాసరావు కు వినతిపత్రం ఇచ్చారు. గత 30 సంవత్సరాలకు పైగా ఈ స్థలంలో ఆటో స్టాండ్ సౌకర్యం ఉండేదాన్నారు. ఆటో అడ్డాను నమ్ముకొని వందల మంది కార్మికులు జీవనం కొనసాగిస్తుండే వారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యపై ఈవో స్పందించి సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కార్యక్రమంలో శంకర్, వివిధ సంఘాల నాయకులు పూనెం కృష్ణ దొర, మునిగేళ్ల శివ ప్రసాద్, శెట్టి రాజారత్నం, పూనెం ప్రదీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కార్డులు జారీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కోల్ ముంతల్ పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నూతనంగా నిర్మించిన డ్రింకింగ్ వాటర్ ప్రారంభించారు అదేవిధంగా కొండమల్లేపల్లి పట్టణంలోని అంబేద్కర్ కాలనీ జేబి కాలనీలో నూతనంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను శంకుస్థాపన చేయడం, పట్టణంలోని సాయికృప ఫంక్షన్ హాల్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆహర భద్రత కారులను మంజూరు పత్రాలను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో దేవరకొండ నియోజకవర్గం తీర్చి దిద్దుతానన్నారు. పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టిందని, ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన మాట మేరకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాక రేషన్ ద్వారా సన్న బియ్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. అర్హులైన వారికి మొదటి విడతల్లో ఇండ్లు మంజూరు చేయడంతో ప్రజలు ఇండ్లు నిర్మాణాలు చేపట్టారని త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - బూర్గంపాడు : బూర్గంపాడు మండలం సారపాకలోని ఐ టి సి కంపెనీ, రోటరీ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. గురువారం మొరంపల్లి బంజర పీహెచ్సీలో సుమారు 15 కిట్లను గర్భిణీ స్త్రీలకు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ, రోటరీ సంస్థ బాధ్యులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం చాలా అవసరం అన్నారు. పుట్టే పిల్లలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండకూడదన్నారు. అందుకే పది రకాల పౌష్టికాహారాన్ని అందజేశామని చెప్పారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు డాక్టర్ల సూచనలు సలహాలు తీసుకోవాలని. ఈ కార్యక్రమంలో ఐటిసి సీనియర్ మేనేజర్స్ చెంగల్ రావు, చాంద్ పాషా, డిపి రాయ్, హాస్పిటల్ డాక్టర్స్ కే.శ్రావణి, తిరుపతి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంపాదకీయం

పేలుళ్లు సత్యం-శిక్ష మృగ్యం

మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు కథ గురువారం ముగిసింది. ఈ పేలుళ్లలో ఆరుగురు మరణించారన్నది నిజమేనట. కానీ గాయపడిన వారి సంఖ్య మీద పోలీసుల వాదనకు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థానానికి మధ్య పొంతన కుదరలేదు. గాయపడిన వారు 106 మంది అన్నది ఎన్ఐఏ లెక్క కాదు 95 మందేనని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఏకే లాహోటి తేల్చారు. ఈ కేసులో బీజేపీ మాజీ ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ కూడా ఏడుగురు నిందితుల్లో ఉన్నారు కనక ఈ కేసు మీద అందరి దృష్టి పడింది. దోషులు ఎవరో మాత్రం ప్రత్యేక న్యాయస్థానం తేల్చలేక పోయింది. పేలుళ్లకు పాల్పడింది ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురు కారణం అని ప్రాసిక్యూషన్ అనుమానాలకు తావు లేకుండా నిరూపించలేకపోయిందట. అందరూ 17 ఏళ్ల తరవాత నిర్దోషులుగా బయట పడ్డారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకోవడం తప్ప చేయగలిగింది ఏమీ లేదు. 2008 సెప్టెంబర్ 29 రాత్రి మాలేగావ్ లోని భిక్కు చౌక్‌లో బాంబు పేలుడు జరిగింది. ఒక మోటారు సైకిల్‌లో పెట్టిన బాంబు పేలిందంటున్నారు. ఈ పేలుడు జరిగిన చోట ముస్లింలు అధిక సంఖ్యలో ఉంటారు. పైగా అది రంజాన్ నెల. దసరా నవరాత్రులు జరగడానికి కొద్ది రోజుల ముందే ఈ పేలుడు జరిగింది. ఈ ఉదంతంలో ఏ అంశాన్ని పరిశీలించినా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మహారాష్ట్ర తీవ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) మొదట ఈ కేసును దర్యాప్తు మొదలు పెట్టింది. అప్పటికి ఏటీఎస్ అధిపతి హేమంత్ కర్కరే. ఆయన ఆ తరవాత అదే సంవత్సరం నవంబర్ 26న జరిగిన మరో తీవ్రవాద సంఘటనలో మరణించారు. ప్రత్యేక కోర్టు 1,087 వాయిదాలలో ఈ కేసు విచారణ పూర్తయింది. 2011లో మాలేగావ్ కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కు బదిలీ చేశారు. ఆ సంస్థ ఈ కేసును మళ్లీ నమోదు చేసి దర్యాప్తు కొనసాగించింది. విచిత్రం ఏమిటంటే ఈ కేసులో ఎన్ఐఏ అనేక చార్జి షీట్లు దాఖలు చేసింది. ఆఖరి చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి ఆరేళ్లు పట్టింది. మొత్తం 323 మంది సాక్షులను విచారించారు. అందులో 39 మంది సాక్షులు ఎదురు తిరిగారు. మరో 30 మంది సాక్ష్యం ఇవ్వకుండానే మరణించారు. మొత్తం మీద వాదోపవాదాలు 2024 ఏప్రిల్‌లో అంటే బాంబు పేలుళ్లు జరిగిన దాదాపు పదహారేళ్లకు ముగిశాయి. 2024 ఏప్రిల్ 19న న్యాయమూర్తి లాహోటీ తీర్పు వెలువరించడాన్ని వాయిదా వేశారు. చివరకు గురువారం తీర్పు వెలువరించి వడ్ల గింజలోదే బియ్యపు గింజ అని తేల్చారు. ఏడుగురు నిందితులు ఉన్నా అందులో ఒక్కరు కూడా దోషి అని రుజువు కాలేదు. మాలేగావ్ పేలుళ్ల తరవాతే "కాషాయ తీవ్రవాదం" అన్న మాట ప్రచారంలోకి వచ్చింది. కానీ గురువారం తీర్పు చెప్పిన న్యాయమూర్తి లాహోటి "తీవ్రవాదానికి మతం ఉండదు" అని తేల్చేశారు. తార్కికంగా చూస్తే ఈ మాట అక్షర సత్యంలాగే కనిపిస్తుంది. ఏ మతమూ హింసను ప్రేరేపించకపోవచ్చు. కానీ మతం పేర హింసను ప్రేరేపించడం నిత్యానుభవమే. మతం పేర హింస జరగొచ్చు. మతం కోసం హింస జరగొచ్చు. ఇతర మతాల మీద ఉన్న విద్వేషం వల్లా హింస జరగొచ్చు. ఈ ఆలోచన న్యాయమూర్తికి వచ్చినట్టు లేదు.

ఈ పేలుళ్ల కోసం ప్రజ్ఞా సింగ్ ఠాకూర్‌కు చెందిన మోటారు సైకిల్‌ను ఉపయోగించారంటున్నారు. ఆ మోటారు సైకిలులోనే పేలుడు పదార్థాలు ఉంచారట. కానీ ఈ సంఘటన జరగడానికి ముందే ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ సన్యసించారు కనక, ఆ మోటారు సైకిల్ ఆమెదేనని ప్రాసిక్యూషన్ వారు నిరూపించలేక పోయారు కనక కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటించింది. న్యాయస్థానాలు తమకు ఇతరత్రా అందుబాటులో ఉండే, లేదా వినిపించే సంఘటనలకు ప్రాధాన్యం ఇవ్వరు. తమ ముందున్న సాక్ష్యాధారాలకే ప్రాధాన్యం ఇస్తారు. కానీ మహాత్మా గాంధీని హతమార్చిన నాథూరాం గాడ్సేను ప్రజ్ఞాసింగ్ ఠాకుర్ కీర్తించడం సదరు న్యాయమూర్తి చెవిన పడకుండా ఉంటుందా! పేలుడువల్లా ఆ మోటార్ సైకిల్ కూడా దగ్ధమైంది కనక దానికి చాసిస్ నంబర్ లాంటివి సేకరించలేక పోయారని, న్యాయసంబంధ (ఫోరెన్సిక్) ఆధారాల్లోనూ కాలుష్యం ఉండొచ్చు కనక ఆ మోటార్ సైకిల్ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్‌దే నని చెప్పలేమని న్యాయమూర్తి అన్నారు. మరో వంక ఆమె తన మోటార్ సైకిల్‌ను అంతకు ముందెప్పుడో అమ్మేశానంటున్నారు. విచ్ఛిన్నకర కార్యకలాపాలకు అందరికీ మోటార్ సైకిళ్ల లాంటి వాహనాలు ఉంటాయని సదరు న్యాయమూర్తి భావించినట్టున్నారు. దర్యాప్తు సంస్థలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడి తన జీవితాన్ని నాశనం చేశారని ప్రజ్ఞా ఆరోపించారు. ఇంకో వేపు ఆమెతో పాటు అరెస్టయిన కల్నల్ పురోహిత్ దర్యాప్తు సంస్థల తప్పేమీ లేదంటున్నారు. అసలు ఈ కేసే మౌలికంగా తప్పు అన్నది ఆయన వాదన. ఈ రెండు వాదనల్లోని వైరుధ్యం న్యాయమూర్తి దృష్టికి వచ్చినట్టు లేదు. అసలు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ మీద చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద కేసు మోపనవసరం లేదని కూడా న్యాయమూర్తి భావించారు. నిందితుల మీద గట్టి అనుమానం ఉన్నా కేవలం అనుమానంతో ఎవరినీ శిక్షించలేం అని న్యాయమూర్తి అన్నారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన రోహిని సలియాన్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఈ కేసును నీరుగార్చాలని ఎన్ఐఏ కోరిందట. హిందూ తీవ్రవాదం గురించి పెద్దగా పట్టించుకోనవసరం లేదని ఎన్ఐఏ ఆ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు చెప్పిందట. ఈ కేసులో తాను నిర్దోషిగా తేలినందుకు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ సంతృప్తి చెందడంలో ఆశ్చర్యం లేదు. కానీ ఆమె "ఇది హిందుత్వ విజయం" అన్నారు. హిందూమత విజయం అనలేదన్న మాటను ప్రత్యేకంగా గమనించవలసిన అవసరం ఉంది. ప్రాసిక్యూషన్ (దోష విచారణ చేసే వారు) తగిన సాక్ష్యాధారాలు చూపించలేదు కనక నిందితులు తప్పుచేసి ఉండకపోవచ్చు అని భావించి వారికి శిక్ష విధించలేదు. మాలేగావ్ పేలుళ్లు అసత్యం కాదు. ఆరుగురి మృతి అబద్ధం కాదు. నిందితులను అరెస్టు చేసి సంవత్సరాల తరబడి జైలులో ఉంచడమూ అబద్ధం కాదు. దోష విచారణ జరిపిన వారు నిందితులకు శిక్ష పడేట్టుగా చేయడంలో విఫలమైతే వారి మీద చర్య తీసుకోవాలని న్యాయస్థానాలు ఎప్పుడూ చెప్పవు. విధి నిర్వహణా లోపం శిక్షార్హం కాదనుకుంటారేమో. కనీసం వారు పని చేసే విభాగాన్ని అయినా కేసును నడపడంలో సరిగ్గా విధి నిర్వహించని వారి మీద దర్యాప్తు జరిపించాలని కూడా కోర్టులు ఆదేశించవు. అందుకే పేలుళ్లు సత్యం. శిక్ష మృగ్యం.

నేతలు నేర్పేదేమిటి!

భారతదేశ పౌరునికి ప్రశ్నించే హక్కులేని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. మన ప్రజాస్వామ్యం గురించి బయట గొప్పలు చెప్పుకుంటాం. కాని చివరకు చట్టసభల్లో కూడా ప్రశ్నించే హక్కు లేకుండా పోతోంది. ఏమిటి, ఎందుకు అనే ప్రశ్నలు వేయకపోతే పాలకులు నియంతలుగా మారే అవకాశం ఉంది. అందుకే పాలకులు ప్రశ్నించడం నేరంగా పరిగణించి అటువంటి వారిపై కేసులు పెట్టడం, దాడులు చేయడం జరుగుతోంది. ప్రస్తుతం ప్రజాస్వామ్యం పార్టీ స్వామ్యంగా మారి చివరకు వ్యక్తి స్వామ్యంగా మారుతోంది. కేంద్రంలోను, రాష్ట్రంలోను చివరకు మంత్రులకు కూడా ప్రశ్నించే హక్కు లేకుండా పోతోంది. ఒకవేళ హక్కు ఉన్నా ప్రశ్నించడం మాని అధినాయకునికే సర్వ హక్కులు కట్టబెట్టారు. పదవులు కాపాడుకొని పదవి ద్వారా సంపాదించుకోవడానికి అలవాటుపడి ప్రశ్నించడం మానివేశారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఎన్నుకుంటే పదవులు పొందిన తరువాత మీ సమస్య లేమిటని ప్రజల వద్దకు రావడం అత్యంత శోచనీయం. ఇతర దేశాల నుంచి వచ్చి ఎన్నికయిన వారికి తెలియకపోవచ్చు గాని ప్రజల్లో తిరిగే నాయకులకు



సమస్యలు తెలియకనే ప్రజలను అడుగుతున్నారా అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అది కూడా ముఖ్యమంత్రి ప్రజల వద్దకు వెళ్లని వారిపై చర్యలుంటాయన్న తరువాత మాత్రమే నాయకులకు ప్రజలు గుర్తుకు రావడం ఆశ్చర్యమే. కేంద్రంలో ప్రధానమంత్రి, రాష్ట్రాలలో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు శిరోధార్యంగా మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు భావిస్తూ అమలు జరపడం తమ వంతుగా భావించి కలెక్టర్లకు ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి అమలుపరచమని అడగడంతో తమ కర్తవ్యం పూర్తయినట్లుగా భావిస్తున్నారు. ఈ రకంగా ప్రజాస్వామ్య ముసుగులో నియంతల పాలన సాగుతోందని మేధావులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.

సమాజంలో మతరహిత ప్రజాస్వామ్యం కోరేవారి మాటలకు విలువ లేదు. ప్రజలు అడగకపోయినా పుష్కరాలకు ప్రజల్ని తరలించడం ద్వారా ప్రజల సొమ్ము ఖర్చుచేసి ఆ సందర్భంగా కొంతమంది ప్రాణాలు బలిగొనడం చివరకు ఆ తప్పంతా మీడియాపైకి తోయడం గతంలో జరిగింది. అంతేకాక ప్రపంచంలోనే గొప్పగా నిర్మించే రాజధానిలో అన్ని మతాల వారికి వారు పవిత్రంగా భావించే మసీదులు, దేవాలయాలు కడతామని కూడా గతంలో నాయకులు వాగ్దానాలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని మతాల వారిని సమదృష్టితో చూడమనే గాని వారికి ప్రజలందరి సొమ్ము ఖర్చుచేసి మతాలను ప్రోత్సహించడం తగని పని. మత వ్యాప్తికి ఖర్చు చేసి ప్రజలను మతం ముసుగులో మత్తులో ముంచి నాయకులు, అధికారులు ప్రజల సొమ్ము దోచుకుంటున్న సంగతి సామాన్య ప్రజలకు కూడా తెలిసినా ప్రశ్నించి జైలుకెళ్లడం దేనికని మిన్నకుంటున్నారు. తహసీల్దారుని, పోలీసులను నాయకులు కొట్టినా చర్యలుండవు కాని ఇదేమి అన్యాయం అని అడిగితే జైలు పాలుకాక తప్పదు . కులమతరహిత సమాజం అవసరమని, ప్రజలకు ఉపాధి కల్పించడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయమని ప్రజలు ఎన్నుకుంటే అందుకు భిన్నంగా పాలన చేయడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. పండుగలకు కానుకలిచ్చి మరల తమనే ఎన్నుకోమని నేతలు అడగడం చూస్తే సమాజాన్ని వెనక్కి నెడుతున్నారని అనిపిస్తోంది. విచిత్రమేమిటంటే గతంలో చదువులేక నాయకుల్ని గుడ్డిగా నమ్మి ఆలోచించే శక్తిలేక అనుసరించేవారు. ప్రస్తుతం చదువుకుని అన్ని అర్థం చేసుకుని కూడా ఆలోచించకుండా గుడ్డిగా పదవుల కోసమో సంపాదన కోసమో నాయకుల్ని అనుసరించడం శోచనీయం.

ప్రజలు ఉపాధి అడిగారే తప్ప ఉచితాలు అడగలేదు. అడగకపోయినా ఒక పార్టీని మించి మరొక పార్టీ ఉచిత పథకాల వర్షం కురిపించారు. చివరగా స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రకటించి కోట్ల రూపాయిలు ఖర్చవుతోందని లోటు బడ్జెటులో సతమతమవుతున్నామని స్టేటుమెంట్లు ఇవ్వడం హాస్యాస్పదం. ముప్పయి కిలోమీటర్లలో విమానాశ్రయం ఉండగా అమరావతిలో మరల పొలాలు కొని మరో విమానాశ్రయం నిర్మిస్తాననటం మేధావులు జీర్ణించుకోలేక పోతున్నారు. సమస్తం రాజధాని నిర్మాణంలో ఉన్న పరిధిలోనే ఉండాలనుకోవడం పట్ల కూడా ఆశ్చర్యం వ్యక్తపరుస్తున్నారు. అసలు నాయకుల్ని ఎన్నుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేది ప్రజల కోసమో నాయకుల కోసమో అర్థం కావడంలేదు. అమరావతి ప్రాంతం భూకంపం వచ్చే ప్రదేశమని కొందరు, ముంపు ప్రాంతమని మరికొందరు చెబుతుండగా అన్ని అమరావతిలోనే కాకుండా రాయలసీమలో కొన్ని, విశాఖలో కొన్ని అమరావతిలో కొన్ని నిర్మిస్తే అందరికి సమన్యాయం చేయడంతో పాటు కీడెంచి మేలెంచమన్నట్లుగా ఏదైనా నష్టం వాటిల్లినా స్వల్పంగానే ఉంటుందని కొందరంటున్నారు.

ఇదిలా ఉండగా ప్రస్తుతం రాజకీయాలు రూపురేఖలు మారిపోతున్నాయి. ఒక పార్టీ మరొక పార్టీని తిట్టుకోవడం, తన్నుకోవడం చివరకు హతమార్చడమే రాజకీయంగా మారింది. అధికార పార్టీ వారు ప్రతిపక్ష నేతల్ని జైల్లో పెడితే తాము అధికారంలోకి వచ్చాక ఇంతకంటె ఘోరంగా మీపై ప్రతిచర్యలుంటాయని స్టేటుమెంట్లు ఇస్తున్నారు. యువతకు నేతలు నేర్పేది ఇదేనా అని విజ్ఞులు ముక్కున వేలేసుకుని ఆశ్చర్యం వ్యక్తపరుస్తున్నారు.

సెల్: 9885569394

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఏమైంది?

డాక్టర్ కె.నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి

పహల్గాం దారుణానికి గురై ఎంతగానో బాధలు పడుతున్న ప్రజలను, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారిని కొంచమైనా శాంతపరచేందుకు తక్షణం జమ్ము-కశ్మీర్‌ను పూర్తిస్థాయి రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి. రాష్ట్రంగా ప్రకటిస్తామని ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో హామీ ఇచ్చి అనేక సంవత్సరాలు అవుతోంది. అయినా ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోలేదు.

ఇండియాకు జమ్ము-కశ్మీర్ ఒక అందమైన బహుమతి. సహజ సిద్ధమైన అందం, ఎటుచూసినా పుష్పాలు, పండ్ల తోటలు, పర్వతశ్రేణులు, పచ్చిక బయళ్లు, నీలి జలాలు పారే నదులు కశ్మీర్ నిండా అల్లుకున్నాయి. జమ్ము-కశ్మీర్ రాజధాని అద్భుతమైన శ్రీనగర్‌కు 2025 జులై 23 న చేరుకున్నాం. ఎంతో అందమైన శ్రీనగర్‌ను మొదటిసారిగా సందర్శించే అవకాశం నాకు లభించింది. సీపీఐ బృందం శ్రీనగర్ నుంచి పహల్గాంకు బయల్దేరింది. ప్రతి ఫర్లాంగు దూరంలో ఒకచోట పోలీసుల నిఘా, తనిఖీ చేయడం మాకు అనుభవమైంది. సైనిక దర్యాప్తు, విచారణతో విసిగిపోయాను. మేము ఎక్కడకు వెళుతున్నామని...మీరు ఎవరని ప్రశ్నించి విసిగించారు. కశ్మీర్‌లో ఏడు లక్షలమంది వివిధ ర్యాంకులకు చెందిన సైనిక సిబ్బందిని నియమించారు. నిఘా కోసం టెర్రరిస్టులు, దాడులు జరిపే వారితో పోరాడేందుకు వీరిని నియమించారు. ఒక్కమాటలో చెప్పాలంటే, కశ్మీర్ సైనిక పాలనలోనే ఉంది. ఎన్నికైన ప్రభుత్వ పాలనలో కశ్మీర్ లేదు. కశ్మీర్‌కు ఇలాంటి పరిస్థితి రావడానికి కారణమేమిటి? భారత ప్రభుత్వంపైన ఇప్పటికీ కశ్మీర్ ప్రజలకు విశ్వాసంలేదు. కశ్మీర్ ప్రజలను టెర్రరిస్టులుగా అనేకసార్లు ముద్ర వేశారు. ఇది వాస్తవమా? ఇలా ముద్ర వేయడానికి ఏమైనా రాజకీయ కారణం ఉందా అనేది పరిశీలించాలి.

షేక్ అబ్దుల్లా కశ్మీర్‌కు మొట్టమొదటి ప్రధానమంత్రి. ఆనాడు అలా పిలిచేవారు. ఆయన పాలనలో "రైతులకు భూమి" అనే నినాదంతో భూ సంస్కరణలను అమలుచేశారు. ఎలాంటి పరిహారం ఇవ్వకుండా భూస్వాముల నుంచి భూములను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడు కొత్త ప్రభుత్వాలు భూ సంస్కరణలు అమలు చేయకుండా కొత్త చట్టాలను తీసుకువచ్చి భూ సంస్కరణలను అమలు చేయలేదు. మొదట భూ సంస్కరణలను అమలు చేసినప్పుడు భూములు లేని కుటుంబాలే లేవు. రైతులు వరి పండించారు. యాపిల్, లిచీ పండ్ల వనాలను పెంచారు. ఆనాడు పేదరికం లేదు. అలాంటి రాష్ట్రంలో అరాచకం ఎందుకు చోటుచేసుకుంది? స్వాతంత్ర్యం అనంతరం కాలంలో రాజకీయాలు ప్రజలకు మంచి జీవనాన్ని అందించాయి. ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగాలను కల్పించింది. అయితే ఇటీవలి కాలంలో భారత ప్రభుత్వంపై కశ్మీర్ ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారు. అధికార కాంక్షతో కేంద్రం అనేక తప్పులుచేసింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని టెర్రరిజం బలపడింది. ఈ క్రమంలో పాకిస్థాన్ కూడా టెర్రరిస్టులను పెంచిపోషించింది. భారత ప్రభుత్వం కశ్మీర్ ప్రజలకు తమపై విశ్వాసం లేకుండా చేసింది. పాకిస్థాన్ జోక్యం చేసుకునేందుకు అవకాశం కలిగి అనేకసార్లు దాడులు జరిపింది.

శ్రీనగర్‌ను సందర్శించిన వారిలో నేను, రామకృష్ణ పాండా, అజీజ్‌పాషా ఉన్నాం. అందరమూ సీపీఐ జాతీయ కార్యదర్శులమే. మేమంతా పహల్గాంను సందర్శించాం. సిందూర్ ఆపరేషన్ జరిగిన ప్రాంతాన్ని కూడా సందర్శించాలని ఆశించాం. ఆ ప్రాంతానికి వెళ్లే మార్గాలన్నింటినీ మూసివేశారు. పహల్గాంను కూడా ఎంతో కష్టంతో చేరుకోగలిగాం. చిల్లర దుకాణాల వ్యాపారులతో, గుర్రాలను నడిపే సహాయకులతో (సిసెస్) మాట్లాడాం. సామాన్య ప్రజలు, చిల్లర దుకాణాలు నడిపేవారు చెప్పిన వాస్తవాలకు మోదీ పదేపదే చేస్తున్న ప్రచారానికి ఏ మాత్రం సంబంధం లేదు. అక్కడ జరిగిన వాస్తవాలు విని ఎంతో ఆశ్చర్యపోయాను. పహల్గాంలో టెర్రరిస్టులు అత్యంత ఘోరంగా అమాయకులైన భారత యాత్రికులు 22 మందిని హతమార్చారు.

యాత్రికులు అత్యంత విలువైన ప్రాణాలను వదిలారు. చనిపోయినవారి కుటుంబాలకు కేవలం లక్ష రూపాయల చొప్పున మోదీ ప్రభుత్వం పంపిణీ చేసింది. అంతటితో తమ బాధ్యత ముగిసిందని భావించింది. ఒక్కొక్క కుటుంబానికి కనీసం కోటి రూపాయలైనా ఇచ్చి ఉండవలసింది. పహల్గాంలో ఎంతో దుర్మార్గమైన, ఘోరమైన సంఘటనలు జరిగిన తర్వాత కనీసం 500 కుటుంబాలు కశ్మీర్ నుంచి తాము జీవిస్తున్న ప్రాంతాలు వదిలి వెళ్లిపోయాయి. వీరిని గురించి ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు. సిందూర్ ఆపరేషన్ సందర్భంగా 5 జెట్ విమానాలు కూలిపోయాయి. సరిహద్దుల్లో నివసిస్తున్న ప్రజలు మా స్థావరాలను కోల్పోయామని చెప్పారు. కశ్మీర్‌లోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లారు. టెర్రరిస్టుల దాడుల కారణంగానే వీరు వలస వెళ్లారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను (పీఓకే) మన సైన్యం ఆక్రమించుకోగలదని దేశ ప్రజలంతా ఆశించారు. యుద్ధాన్ని మధ్యలోనే నిలిపివేశారు. సిందూర్ ఆపరేషన్‌ను ఎన్నికల ప్రచారానికి మోదీ ఉపయోగించుకున్నారు. కశ్మీర్‌కి యాత్రికులను ప్రోత్సహిస్తున్నారు. అయితే యాత్రికులు భయభ్రాంతులవుతున్నారు. చిల్లర దుకాణదారులు మనుగడ సాగించలేకపోతున్నారు. పహల్గాం దుర్ఘటన జరగడానికి ముందు వేయి గుర్రాలను నిలిపిఉంచారు. అయితే ప్రస్తుతం మహా అయితే వంద గుర్రాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు యాత్రికులు కశ్మీర్‌కు రావడంలేదు. అందమైన పర్వత శ్రేణుల వైపు యాత్రికులు వెళ్లడంలేదు. ప్రజలంతా విచారంలో ఉన్న కాలంలో సైతం మోదీ ఈ దుర్ఘటనను ఎన్నికల కోసం వినియోగించుకుంటున్నారు. మోదీ విషతుల్యమైన రాజకీయాలను నడుపుతున్నారు.

2019 ఆగస్టు 5 వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇచ్చినటువంటి 370 వ అధికరణను రద్దు చేసి దానికిగల ప్రత్యేక రాజ్యాంగ స్థానాన్ని తొలగించింది. రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. ఒమర్‌అబ్దుల్లా ప్రభుత్వం 2024 అక్టోబరులో ఏర్పడిన తర్వాత 9 నెలలపైగా ప్రజలలో గల అవిశ్వాసం చాలా ఎక్కువగా ఉన్నది. ఎన్నికైన ప్రభుత్వాన్ని చీల్చిన తర్వాత కేంద్రం లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించింది. అయినప్పటికీ, సమర్థమైన ప్రభుత్వాన్ని నిర్వహించలేకపోయారు. లెఫ్టినెంట్ గవర్నర్ కాలంలోనే ప్రజలలో విసుగు పెరిగింది. పరిపాలనలో గందరగోళం ఏర్పడింది. విధానాలు రూపొందించడం జాప్యమైపోయింది. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం, పూర్తిస్థాయి రాష్ట్రాన్ని ప్రకటించాలి.

సెల్ : 9490952222

తగినంత మంది పోలీసులు లేరు

కశ్మీర్‌లో తగినంత మంది పోలీసులు లేరంటే ఈ పరిస్థితి దేన్ని తెలియజేస్తుంది? ఇప్పటికి కూడా కేంద్ర ప్రభుత్వం పైన కశ్మీర్ ప్రజలకు విశ్వాసం కలగడంలేదు. ఇందిరాగాంధీ పాలనా కాలంలోనే ఇలాంటి పరిస్థితి ప్రారంభమైంది. ఆనాటి పరిస్థితి నేడు మరింత ఘోరంగా మారింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జమ్ము-కశ్మీర్ రాజకీయ చరిత్రలో అనేక గందరగోళ సంఘటనలు జరిగాయి. వీటిలో అత్యంతగా గణించదగిన సంఘటన జరిగింది. ఈ ప్రాంతంలో అత్యంత ప్రభావం కలిగిన గొప్ప నాయకుడు షేక్ మహమ్మద్ అబ్దుల్లాను కేంద్రప్రభుత్వం అరెస్టు చేసింది. షేక్ అబ్దుల్లాను తరచుగా "లైన్ ఆఫ్ కశ్మీర్" అని పిలిచారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన కశ్మీర్ ప్రధాని ఆయన. ప్రజలకు ఎంతో ఇష్టమైన నాయకుడాయన. ఉపఖండం విభజన తర్వాత సంవత్సరాలలో రాజకీయ వాతావరణాన్ని ప్రజానుకూలంగా మార్చడంలో ఆయన కీలకమైన పాత్రను నిర్వహించారు. 1950 లలో భూ సంస్కరణలను అమలు చేసి గొప్పగా ప్రజాదరణను పొందారు. అనేక శతాబ్దాలుగా నెలకొని ఉన్న భూస్వామ్య విధానాన్ని నిర్మూలించి పేదరైతులకు భూములను పంపిణీ చేశారు. దీనితో కశ్మీర్‌లో సామాజిక, ఆర్థిక మార్పులు జరిగాయి. ప్రాంతీయ స్వయంప్రతిపత్తిని ఆర్టికల్ 370 కింద కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను సాధించారు. 1953లో అనేక నాటకీయ పరిణామాలు జరిగాయి. షేక్ అబ్దుల్లాను ప్రభుత్వం నుంచి తొలగించారు. అనంతరం ఆయనను అరెస్టు చేశారు. అప్పుడు శ్రీనగర్‌కు, న్యూఢిల్లీకి మధ్య అవిశ్వాసం ఏర్పడింది. ఆనాడు చోటుచేసుకున్న ప్రాంతీయ రాజకీయాలు నేడు ప్రగాఢమైపోయాయి. షేక్ అబ్దుల్లా అరెస్టుతో జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తి కోల్పోయింది. అబ్దుల్లా అరెస్టు తర్వాత కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దిగజారిపోయాయి. అవి 1984లో మరింత దెబ్బతిన్నాయి. అదే సంవత్సరం కేంద్ర ప్రభుత్వం అక్కడ పాలక నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో విభజన తీసుకువచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ ఫరూక్ అబ్దుల్లాను తొలగించింది. అనంతరం ఆయన స్థానంలో బావమరిది గులాం మహమ్మద్ షాను నియమించింది. పార్టీలో ఆయన అసమ్మతివాదిగా ఉన్నారు. మహమ్మద్ షా పాలన దాదాపు రెండేళ్లు సాగింది. అయితే ఈ కాలంలో శాంతి భద్రతల సమస్యలు తీవ్రమై తరచుగా కర్ఫ్యూ పెట్టారు. 1989లో తీవ్రవాదం తలెత్తి కశ్మీర్ గవర్నరుగా జగ్‌మోహన్‌ను నియమించారు. ఆయన కాలంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. జగ్‌మోహన్ కాలంలో అధికార లెక్కల ప్రకారం, 40 వేల మందికిపైగా హతమయ్యారు. 1990 నుంచి 96 వరకు రాష్ట్రపతి పాలన సాగింది. ఈ సమయంలో ప్రజాస్వామ్యంలో శూన్యం ఏర్పడింది. రాజకీయ సంస్థలపైన ప్రజలకు విశ్వాసం లేకుండాపోయింది. పెద్దసంఖ్యలో ప్రజలకు ఓట్లు లేకుండా పోయాయి. ఎన్నికైన ప్రభుత్వాలు లేవు. విశాల ప్రజానీకంలో మానవహక్కులు లేక ఆందోళన చెందారు. 1996లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగింది.

ఆదాయం కన్నా అప్పులే అధికం

ఆర్ సూర్యమూర్తి

మోదీ పాలనలో సగటు భారతీయులు సంపాదించే దానికంటే ఎక్కువగా రుణపడి ఉన్నారు. అందువల్ల కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సమన్యాయంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనావుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఇటీవల పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ రెండు సంబంధంలేని ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు భారత ఆర్థిక వ్యవస్థ వాస్తవికతను కల్లకట్టినట్టు చూపాయి. తలసరి ఆదాయం, తలసరి ప్రజా రుణంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానాలు 2025 మధ్యలో భారతదేశ దేశ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా ఉన్నదో తెలిపాయి. ఈ సమాధానాలు చూసిన వెంటనే ప్రభుత్వ గణాంకాలు భరోసా ఇస్తున్నట్లు అనిపిస్తాయి. లోతుగా పరిశీలిస్తేగాని అసలు బండారం బయటపడదు. తలసరి నికర జాతీయ ఆదాయం (ఎన్ఎన్ఐ) 2014-15లో రూ.72,805 నుంచి 2024-25లో రూ.1,14,710కి పెరిగింది - దశాబ్దంలో ఇది 57.5% పెరుగుదల. ఇంతలో, కేంద్ర ప్రభుత్వం 2030-31 నాటికి తన అప్పు-జీడీపీ నిష్పత్తిని 50శాతానికి తగ్గిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఈ గణాంకాల వెనుక మరింత ఇబ్బందికరమైన చిత్రం ఉంది - పెరుగుతున్న ప్రాంతీయ అసమానతలు, భరించలేని రుణ భారాలు, వృద్ధి, సమానత్వం మధ్య నిరంతర విధాన అంతరం కనిపిస్తోంది. లోక్‌సభ నక్షత్ర గుర్తు లేని ప్రశ్నలలోని డేటాను కలిపి పరిశీలించినప్పుడు, భారతదేశ వృద్ధి స్వభావం, "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్" ప్రయోజనాలు సగటు పౌరుడికి చేరుతున్నాయా అనే దాని గురించి ప్రాథమిక



ప్రశ్నలను లేవనెత్తుతాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, 2024-25లో తలసరి ఆదాయం స్థిర ధరల వద్ద రూ.1,14,710గా ఉంది. ఇది ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేసిన తర్వాత కూడా వాస్తవ ఆదాయ వృద్ధిని, జాతీయ శ్రేయస్సు పెరుగుతుందని సూచిస్తోంది. అయినప్పటికీ, 2025 మార్చి 31 నాటికి కేంద్ర ప్రభుత్వ తలసరి రుణ బాధ్యత రూ.1,32,059.66గా ఉంది - అంటే సగటు భారతీయుడు సాంకేతికంగా ప్రభుత్వ రుణదాతలకు ఒక సంవత్సరంలో సంపాదించే దానికంటే ఎక్కువ రుణపడి ఉంటాడు. విడిగా చూస్తే, ఈ రెండు గణాంకాలు ఆందోళనకరంగా ఉండకపోవచ్చు. కానీ కలిపి చూస్తే, అవి ఒక విరుద్ధమైన విషయాన్ని ప్రదర్శిస్తాయి: పౌరులు ఎక్కువ సంపాదిస్తున్నప్పటికీ, వారు ఏకకాలంలో పెరుగుతున్న ప్రజా రుణంతో భారం పడుతున్నారు - దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం, ప్రభుత్వ పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీసే ఒక అదృశ్య పన్ను వీరిని పీడిస్తోంది. ఈ ముఖ్యమైన అంశాలను పరిశీలిస్తే, ప్రభుత్వ బాధ్యతలపై వడ్డీ చెల్లింపులు 2022-23లో రూ.9.29 లక్షల కోట్ల నుంచి 2024-25లో రు.11.18 లక్షల కోట్లకు పెరిగాయి, 2025-26 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.12.76 లక్షల కోట్లు కేటాయించారు. మొత్తం కేంద్ర ప్రభుత్వ వ్యయంలో దాదాపు పావు వంతు ఆరోగ్యం, విద్య లేదా మౌలిక సదుపాయాలకు కాకుండా పాత అప్పులను తీర్చడానికి ఖర్చు చేస్తోంది. 2025-26లో ద్రవ్యలోటును జీడీపీలో 4.4%కి తగ్గించి, 2026 నుంచి రుణ భారాలను తగ్గించేందుకు ప్రయత్నిస్తామని ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ ఈ ప్రణాళిక విశ్వసనీయత బలమైన జీడీపీ వృద్ధి, పన్ను పెరుగుదల గురించిన అంచనాలపై ఆధారపడి ఉంటుంది - ఈ రెండూ ప్రపంచ ఆర్థిక సంక్షోభం, అసమాన దేశీయ పునరుద్ధరణ మధ్య అనిశ్చితంగా ఉన్నాయి.

తలసరి ఆదాయ డేటా నుంచి అత్యంత స్పష్టమైన అంతర్దృష్టి రాష్ట్రాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం. 2024-25లో గోవా, కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1.75 లక్షల కంటే ఎక్కువగా ఉందని నివేదించగా, బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రూ. 75,000 కంటే తక్కువగా ఉన్నాయి. వాస్తవానికి, బీహార్ తలసరి ఆదాయం గోవాలో దాదాపు ఆరవ వంతు. ఒడిశా, కర్నాటక, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు గత దశాబ్ది కాలంలో వారి తలసరి ఆదాయాన్ని దాదాపు రెట్టింపు చేశాయి, మరికొన్ని రాష్ట్రాలు రక్తహీనత వృద్ధిని నమోదు చేశాయి. పదేళ్ల కాలంలో బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర తలసరి ఆదాయం కేవలం 47.9% మాత్రమే పెరిగింది, తెలంగాణలో ఇది 85% కంటే ఎక్కువగా, ఒడిశాలో ఇది 96.7% కంటే ఎక్కువగా ఉంది. ఈ వైవిధ్యం కేవలం వేర్వేరు ప్రారంభ బిందువులలో మాత్రమే కాకుండా విద్య, పారిశ్రామికీకరణ, పాలన, పెట్టుబడిలో నిర్మాణాత్మక అసమానతలను ప్రతిబింబిస్తుంది. సమ్మిళిత వృద్ధికి సంబంధించిన కేంద్రం కథనం అటువంటి అంతరాలు పెరుగుతున్నప్పుడు, తగ్గడం లేదు. ప్రభుత్వం ఆదాయ వృద్ధిలో అసమానతలకు "ఆర్థిక అభివృద్ధి స్థాయిలు, రంగాల కూర్పు, నిర్మాణాత్మక అసమానతలు, పాలనా యంత్రాంగాలు" కారణమని చెబుతోంది. నిజమే అయినప్పటికీ, ఈ నిష్క్రియాత్మక నిర్ధారణ కేంద్రం సొంత జవాబుదారీతనం నుంచి పక్కదారి పడుతోంది. లక్ష్యంగా పెట్టుకున్న ఆర్థిక బదిలీలు లేకపోవడం, ఆలస్యమైన జీఎస్టీ పరిహారం, ఒకే పరిమాణానికి సరిపోయే ఆర్థిక విధానాలు తరచుగా రాష్ట్ర స్థాయి దుర్బలత్వాలను తీవ్రతరం చేస్తున్నాయి. అంటే రోగ నిర్ధారణ కేంద్రం సొంత జవాబుదారీతనం నుంచి పక్కదారి పడుతోంది.

అంతేకాకుండా, "సబ్ కా సాత్" పట్ల కేంద్రం వాక్చాతుర్య నిబద్ధత తరచుగా పేద రాష్ట్రాలను బడ్జెట్ నిర్లక్ష్యం చేస్తుంది, ఎందుకంటే అవి మానవ మూలధనంలో పెట్టుబడి పెట్టడానికి లేదా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి తక్కువ సన్నద్ధంగా ఉంటాయి. సమాఖ్య వ్యవస్థలో, పెరుగుతున్న జాతీయ ఆదాయం విజయానికి ఏకైక కొలమానం కాదు - రాష్ట్రాలలో తలసరి ఆదాయాల కలయిక లక్ష్యం కావాలి, కేవలం గణాంక ఉప ఉత్పత్తి కాదు. ఆర్థిక పరిస్థితిపై డాంబికాలు పలికే కేంద్ర ప్రభుత్వానికి ఈ గణాంకాలు విజయోత్సాహాన్ని కాదు, ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవశ్యకతను నొక్కిచెపుతున్నాయి. గ్రామీణ కార్మికులు, అసంఘటిత కారిక కార్మికులు, సూక్ష్మ వ్యాపారవేత్తలకు ఆదాయం తగ్గిపోతుందా? పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం లేదా అప్పుల ద్వారా ఇది భర్తీ చేయబడుతుందా? అన్నది ప్రశ్న. విధాన తృప్తిలో ప్రమాదం ఉంది-ఇక్కడ సగటు వృద్ధి కొలమానాలు లేమిలను కప్పివేస్తాయి. పెరుగుతున్న ప్రజా రుణాన్ని అవసరమైన చెడుగా పక్కనపెట్టారు. భారతదేశానికి మరింత స్థిరమైన, బహుమితీయ ఆర్థిక వ్యూహం అవసరం. విధాన నిర్ణేతలు స్థూల ఆర్థిక దృక్పథాల నుంచి సూక్ష్మ ఆర్థిక న్యాయం వైపు - వృద్ధిని గొప్పగా చెప్పుకోవడం నుంచి దాని న్యాయమైన పంపిణీని నిర్ధారించడం వరకు - దృష్టి సారించాలి.

(న్యూయేజ్ ఆగస్టు 03-09 సంచిక నుంచి)

మోదీతోనే ఆర్థిక వ్యవస్థ పతనం

ట్రంప్ చెప్పింది వాస్తవమే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ వినాశకార విధానాలతో దేశ భవిష్యత్ అంధకారమైందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసింది మోదీ ప్రభుత్వ విధానాలేనన్నారు. ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని ప్రధానికి, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాలను సర్కారు నాశనం చేసిందని పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో గురువారం విలేకరులతో మాట్లాడిన రాహుల్ విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ షరతుల ప్రకారమే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం జరుగుతుందని అన్నారు. ట్రంప్ ఏం చెబితే మోదీ అదే చేస్తారని రాహుల్ దుయ్యబట్టారు. రష్యా-భారత్ ఆర్థిక వ్యవస్థలు బలహీనమయ్యాయని, ఆ రెండు దేశాలు కలిసి మునిగిపోతాయని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు రాహుల్ స్పందిస్తూ 'భారత ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని ట్రంప్ చెప్పడంలో తప్పులేదు. ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఇది తెలుసు. ట్రంప్ వాస్తవాలే వెల్లడించారు' అని అన్నారు. ఒక వైపు అత్యద్భుత విదేశాంగ విధానం ఉందని విదేశాంగ మంత్రి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు అమెరికా దూషిస్తోందని, ఇక చైనా ఆ పని చేయాల్సి ఉందని రాహుల్ వ్యాఖ్యానించారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటనలకు పార్లమెంటులో ప్రధాని మౌనంగా ఉండటాన్ని విమర్శించారు. విదేశాలకు బృందాలను పంపి హడావిడి చేశారు కానీ ఏ దేశం కూడా పాకిస్థాన్‌ను బహిరంగంగా ఖండించలేదన్నారు. 'వీళ్లు (మోదీ ప్రభుత్వం) దేశాన్ని ఎలా పాలిస్తారా? అసలు వీరికి దేశ పాలన ఎలాగో తెలియదు' అని రాహుల్ విమర్శించారు. లోక్‌సభలో మోదీ మాటలు గుర్తుచేస్తూ ట్రంప్ పేరును కనీసం ప్రస్తావించలేదని, చైనా గురించీ ఒక మాటైనా మాట్లాడలేదని అన్నారు.

'పహల్గాం దాడిలో పాత్ర కలిగిన పాకిస్థాన్ సైన్యాధికారితో కలిసి ట్రంప్ భోజనం చేశారని, వీళ్లేమో గొప్ప విజయం సాధించినట్లు చెప్పుకుంటున్నారు. వీరు సాధించిన విజయం ఏమిటో!' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 'కాల్పుల విరమణ తన వల్లే జరిగిందని ట్రంప్ 30 సార్లు చెప్పారు. భారత్ ఐదు యుద్ధ విమానాలు కోల్పోయిందన్నారు. 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. మోదీ ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారు? కారణం ఏమిటి? ఎవరు నియంత్రిస్తున్నారు? అని రాహుల్ ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, విదేశాంగ విధానాలను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని, ఇదే భారత్‌కు పెద్ద సవాల్‌గా మారిందన్నారు. దేశాన్ని పాతాళానికి తొక్కేస్తున్నారని... ప్రధాని ఒకే ఒక్క వ్యక్తి అదానీ కోసం పనిచేస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. చిరు వ్యాపారాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. అంతకుముందు ఎక్స్‌లోనూ విమర్శలు గుప్పించారు. 'భారత ఆర్థిక వ్యవస్థ పతనమైంది. మోదీయే చంపేశారు. 1) అదానీ-మోదీ భాగస్వామ్యం. 2) నోట్లరద్దు, తప్పుడు జీఎస్‌టీ విధానం 3) విఫలమైన భారత కూర్పు 4) ఎంఎస్ఎంఈలు తడిచిపెట్టుకుపోవడం. 5) రైతుల అణచివేత. మోదీ పాలనలో ఉద్యోగ కల్పన లేదు. దేశ యువత భవిష్యత్ సర్వనాశనమైంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఎన్డీయేకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

చెన్నై: తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ గురువారం ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. అదే సమయంలో ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు రామచంద్రన్ తెలిపారు. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన వెల్లడించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా... కాలమే చెబుతుందంటూ సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన... సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి బయటకు రావడం... 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

బాలుడి చేయి కాల్చిన టీచర్

ముంబై: చేతిరాత సరిగా లేదని క్యాండిల్‌తో విద్యార్థి చేయి కాల్చిన టీచర్ క్రూర ప్రవర్తన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ముంబైలోని ఈస్ట్ మలాడ్ జేపీ డెక్స్ భవనంలో రాజశ్రీ రాథోడ్ ట్యూషన్స్ చెబుతుంది. అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ హమ్జా ఖాన్ (8) స్థానిక లక్షధామ్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. రోజూ సాయంత్రం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు రాజశ్రీరాథోడ్ ఇంటికి ట్యూషన్‌కు వెళ్తాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి కూడా హమ్జా ఖాన్‌ను అతడి సోదరి ట్యూషన్‌కు పంపి వెళ్లింది. అయితే చేతిరాత సరిగా లేదని రాజశ్రీ ఆ బాలుడిపట్ల క్రూరంగా ప్రవర్తించింది. క్యాండిల్ వెలిగించి దానిపై బాలుడి కుడిచేయి పెట్టించింది. మంటలకు తాళలేక బాలుడు ఏడవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో హమ్జా ఖాన్ బాగా ఏడుస్తున్నాడని, వెంటనే వచ్చి ఇంటికి తీసుకెళ్లాలని టీచర్ రాజశ్రీ రాథోడ్ బాలుడి తండ్రి ముస్తకీన్ ఖాన్‌కు ఫోన్ చేసింది. దాంతో ముస్తకీన్ బాలుడిని ఇంటికి తీసుకెళ్లాడు. అయితే ఇంటికి తీసుకెళ్లిన తర్వాత బాలుడు విషయం చెప్పడంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి యూపీఐ కొత్త నియమాలు

న్యూఢిల్లీ: యూపీఐ సేవలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.ఆగస్టు ఒకటో తేదీ నుంచి యూపీఐ కొత్త నియమాలు అమలు కాబోతున్నాయి. ఫోన్‌పే, జీపే, పేటీఎంలను క్రమం తప్పకుండా వినియోగిస్తుంటే, మెరుగైన చెల్లింపు సౌకర్యాలను అందించడానికి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేక నియమాలను మార్చింది. ఇందులో భాగంగా ఎన్‌పీసీఐ కొన్ని కొత్త పరిమితులను విధించింది. ఇది మీ చెల్లింపులను ప్రభావితం చేయదు... కానీ, బ్యాలెన్స్ చెక్, స్టేటస్ రిఫ్రెష్, ఇతర విషయాలపై ఆంక్షలను విధిస్తుంది. అయితే, ఆగస్టు ఒకటో తేదీ నుంచి యూపీఐ యాప్ నుంచి రోజులో 50 సార్లు మాత్రమే బ్యాలెన్స్ చెక్ చేయడానికి అవకాశం ఉంటుంది. మీరు మీ మొబైల్ నంబర్‌కు లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలను రోజుకు 25 సార్లు మాత్రమే తనిఖీ చేయగలరు. నెట్‌ఫ్లిక్స్ లేదా మ్యూచువల్ ఫండ్ వాయిదాల వంటి ఆటోపే లావాదేవీలు ఇప్పుడు కేవలం మూడు టైమ్ స్లాట్‌లలో ప్రాసెస్ చేయబడతాయి. ఉదయం 10 గంటలకు ముందు, మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు. అలాగే రాత్రి 9.30 తర్వాత... మీరు ఒక రోజులో మూడు సార్లు మాత్రమే విఫలమైన లావాదేవీల స్థితిని తనిఖీ చేసే వీలుంటుంది. ప్రతి చెకింగ్‌కు మధ్య 90 సెకన్ల గ్యాప్ ఉంటుంది. మీరు ఎస్‌బీఐ కార్డ్ హోల్డర్ అయితే, మీకు బిగ్ షాక్ అని చెప్పాలి. ఎందుకంటే ఆగస్టు 11వ తేదీ నుంచి ఎస్‌బీఐ అనేక కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులపై అందుబాటులో ఉన్న ఉచిత విమాన ప్రమాద బీమా కవర్‌ను నిలిపివేయబోతుంది. ఇప్పటి వరకు ఎస్‌బీఐ, యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, పీఎస్‌బీ, కరూర్ వైశ్య బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్‌లతో కలిసి కొన్ని ఈఎల్ఐటీ, పీఆర్ఐఎంఈ కార్డులపై రూ. కోటి లేదా రూ. 50 లక్షల వరకు బీమా కవర్‌ను అందించేది.

మోదీకి వ్యక్తిగత బంధమే ప్రాధాన్యం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత దౌత్యబంధమే ప్రధానమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. వ్యక్తిగత స్నేహం కోసం విదేశాంగ విధానాన్ని ప్రధాని నీరుగార్చారని దుయ్యబట్టారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 25 శాతం సుంకం, జరిమానా అమలు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో జైరాం రమేశ్ బుధవారం మోదీ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. భారత్ విషయంలో ట్రంప్ వైఖరి మరింత కఠినంగా మారుతోందని అన్నారు. మే 10 నుంచి కనీసం 30 సార్లు ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపినట్లు ఆయన చెప్పుకున్నారని, నాలుగు దేశాల్లో ఇదే ప్రకటన చేశారని ఎక్స్ మాధ్యమంగా జైరాం రమేశ్ వెల్లడించారు. 'జూన్ 18న పాకిస్థాన్ సైన్యాధికారికి శ్వేతసౌధంలో ట్రంప్ విందు ఇచ్చారు. జులై 30న భారత్ నుంచి ఎగుమతులపై 25 శాతం సుంకం, రష్యాతో వాణిజ్యం చేసినందుకు జరిమానా ప్రకటించారు. ఇరాన్‌తో సంబంధాలున్న ఆరు భారతీయ కంపెనీలపై ఆంక్షలు విధించారు. అదే రోజు చమురు, గ్యాస్ నిల్వలు అభివృద్ధి చేసుకునేలా పాకిస్థాన్‌కు తోడ్పాటు అందిస్తామన్నారు. ఇదంతా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ నుంచి పాకిస్థాన్‌కు అందే ఆర్థిక సాయానికి అదనంగా అందే చేయూత' అని జైరాం రమేశ్ వెల్లడించారు. మోదీ గతంలో 'టాప్' ఛాలెంజ్ అంటూ టమోటా, ఉల్లి, బంగాళ దుంప ధరలపై చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ... నేడు భారత్ 'క్యాప్' ఛాలెంజ్‌ను ఎదుర్కొంటోందని, ఇది చైనా, అమెరికా, పాకిస్థాన్ నుంచి రాజకీయపరమైన సవాల్ అని అన్నారు. గతంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్... ఇటీవల ట్రంప్‌తో స్నేహాన్ని పెంచుకోవడానికి మోదీ ఎంతో శ్రమించారని... మోదీ అహంకారం, ఆత్మస్తుతి నైజం ద్వారా ఏ విధంగా ఆయనను ప్రభావితం చేయొచ్చన్నది ఈ ఇద్దరు నాయకులు గ్రహించారని, దీంతో ఆయనను తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకొని వాషింగ్టన్‌ను నిలదీయాలని మోదీకి సూచించారు. ఫొటోలు, స్వీయప్రచారాన్ని వీడాలని జైరాం రమేశ్ హితవు పలికారు.

ట్రంప్ ఒత్తిడికి లొంగొద్దు: శశిథరూర్

న్యూఢిల్లీ: భారత దిగుమతులపై 25 శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ గురువారం స్పందించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. పార్లమెంటు వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'భారత వాణిజ్యానికి అమెరికా అతిపెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారీఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను అమెరికా అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ చెప్పారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోకుండా... న్యూఢిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ట్రంప్ ఒక బఫూన్: ఒవైసీ



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వైట్‌హౌస్‌లో 'బఫూన్ ఇన్ చీఫ్' అంటూ వ్యాఖ్యానించారు. ఆగస్టు 1 నుంచి భారత్‌పై 25 శాతం సుంకం విధించినట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌పై అసదుద్దీన్ ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. భారత ప్రభుత్వాన్ని బెదిరించడం బాధగా ఉందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు ట్రంప్ కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. ట్రంప్ చర్యలు భారతదేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థితిపై ఉద్దేశపూర్వక దాడి చేస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. భారత ప్రభుత్వాన్ని 'వైట్‌హౌస్‌లోని బఫూన్-ఇన్-చీఫ్' బెదిరించడం విచారకరమని అన్నారు. భారతదేశానికి వ్యతిరేకంగా పెరుగుతున్న శత్రుత్వాన్ని చాలా సంవత్సరాలుగా పార్లమెంట్‌లో లేవనెత్తుతున్నట్లు గుర్తుచేశారు. ఆగస్టు 1 నుంచి అమెరికాకు వచ్చే భారత ఎగుమతులన్నింటిపై 25 శాతం సుంకం విధించినట్లు ట్రంప్ ప్రకటించారు. అంతేకాకుండా రష్యాతో సంబంధాలు పెట్టుకుంటే మరింత జరిమానా ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు.

రెండు దేశాలకు భారత్ అనుకూలం

పలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణపై రాజ్యసభలో కేంద్రం

న్యూఢిల్లీ: స్వతంత్ర, సార్వభౌమ పలస్తీనా దేశం కోసం 'టూ స్టేట్' పరిష్కారం దిశగా చర్చలకు భారత్ ఎల్లప్పుడు మద్దతు ఇచ్చిందని కేంద్రం పేర్కొంది. గుర్తించిన-సురక్షితమైన సరిహద్దులను కలిగివుండి, ఇజ్రాయిల్‌తో శాంతి సంబంధాలు కలిగిన దేశంగా పలస్తీనా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు గురువారం రాజ్యసభకు ఎంఈఏ వెల్లడించింది. దేశ విదేశాంగ విధానంలో సమగ్ర భాగంగా ఉన్న పలస్తీనాకు భారత్ మద్దతిస్తుందా అన్న ప్రశ్నకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పలస్తీనాకు భారత్ ఎప్పుడూ అనుకూలమేనని, టూ స్టేట్ పరిష్కారానికి కట్టుబడిందని, ఆ దిశగా చర్చలకు మద్దతు ఇచ్చిందని, స్వతంత్ర-సార్వభౌమ పలస్తీనాను కాంక్షించిందని వెల్లడించారు. 2023, అక్టోబరు7న ఇజ్రాయిల్‌పై ఉగ్రదాడిని, ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరులో జరుగుతున్న ప్రాణ నష్టాన్ని తీవ్రంగా ఖండించినట్లు పేర్కొన్నారు. భద్రతా పరిస్థితిపై ఆందోళనతో కాల్పుల విరమణకు భారత్ పిలుపునిచ్చిందన్నారు. బందీల విడుదల, శాంతియుతంగా, దౌత్యపద్ధతుల్లో సమస్యను పరిష్కరించుకోవాలని కోరినట్లు వెల్లడించారు. గాజాలో తక్షణ-బేషరతు కాల్పుల విరమణ, బందీల విడుదల, నిరాటకంగా మానవతా సాయం కోసం తీర్మానిస్తూ జూన్ 12న ఐరాస సర్వసభ్య సమావేశంలో జరిగిన ఓటింగ్‌లో భారత్ ఎందుకు పాల్గొనలేదని సభ్యులు ప్రశ్నించగా... పలస్తీనా ప్రజలకు సురక్షిత, సమయానుచిత, సుస్థిర మానవతా సాయం అందాలని భారత్ పునరుద్ఘాటించిందని సింగ్ తెలిపారు. ఇజ్రాయిల్-పలస్తీనాను దగ్గర చేస్తే నేరుగా శాంతి చర్చలను పునరుద్ధరించవచ్చని సూచించినట్లు వెల్లడించారు. ఐరాస, బ్రిక్స్, నామ్, వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ వంటి ద్వైపాక్షిక, బహుపక్షిక వేదికల నుంచి పలస్తీనాకు భారత్ మద్దతు ఇచ్చిందని సింగ్ తెలిపారు. తమ విధానం, పరిష్కారం దిశగా చర్చలు జరగకపోవడం దృష్ట్యా జూన్ 12న యూఎన్‌జీఏ అత్యవసర సదస్సు నిర్వహించిన ఓటింగ్‌లో భారత్ పాల్గొనలేదని కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు.

ధర్మస్థల మరణాలపై ముమ్మర దర్యాప్తు

బెంగుళూరు: కర్నాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల' లో అనుమానాస్పద మరణాలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సిట్ చీఫ్ ప్రణబ్ మొహంతి, డీఐజీ ఎం.ఎన్.అనుచేత్ అధ్వర్యంలో జరుగుతున్న ఈ కేసు దర్యాప్తులో గురువారం కీలక సమాచారం లభించింది. పారిశుధ్య కార్మికుడు చూపిన ఆరో స్థలంలో తవ్వకాలు జరుపగా ఎముకలు బయటపడ్డాయి. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో తానే స్వయంగా కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పుడు అక్కడ పనిచేసిన పారిశుధ్య కార్మికుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసి సంచలనం రేపాడు. ఈ నేపథ్యంలో ఆ అనుమానాస్పద మరణాలపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సిట్ చీఫ్‌గా ప్రణబ్ మొహంతిని నియమించింది.. సిట్ బృందానికి ఆ కార్మికుడు 14 ప్రదేశాలను చూపించాడు. ఇప్పటికే ఐదు ప్రదేశాల్లో తవ్వకాలు పూర్తయ్యాయి. తొలి ప్రదేశంలో గత వారం తవ్వకాలు జరుపగా ఒక చీటి, ఒక పర్సు లభ్యమయ్యాయి. వాటిని పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆరో ప్రదేశంలో పెద్ద సంఖ్యలో ఎముకలు దొరికాయి. అనుమానాస్పద మరణాలకు సంబంధించి దొరికిన తొలి ఆధారం ఇదే. మిగిలిన ఎనిమిది ప్రదేశాల్లో మానవ అవశేషాలు లభించే అవకాశం ఉందని పారిశుధ్య కార్మికుడు చెబుతున్నాడు. కాగా, ధర్మస్థల దక్షిణ కన్నడ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం.గతంలో అక్కడ పనిచేసి మానేసిన ఓ పారిశుధ్య కార్మికుడు సంచలన విషయాలు బయటపెట్టాడు. 1998 నుంచి 2014 మధ్య అక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని, వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు చెప్పాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారి మృతదేహాలని, వారు లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నాయని అతడు తెలిపాడు. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండటంతో తాము ఆనాడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ కార్మికుడు తెలిపాడు.

అండమాన్ నికోబార్‌లో ఈడీ సోదాలు

పోర్టుబ్లెయిర్: మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఈడీ తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి. ఓ సహకార బ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు కాంగ్రెస్ మాజీ ఎంపీ కుల్దీప్‌రాయ్ శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి.

దీనికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు పోర్ట్‌బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు (ఏఎన్ఎస్‌సీబీ) ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి... బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలు మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ రుణాల్లో చాలావరకు నగదు రూపంలో ఉపసంహరించుకుని... గతంలో బ్యాంకు వైస్‌చైర్మన్‌గా పనిచేసిన కుల్దీప్‌రాయ్ శర్మకు, ఇతరులకు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు... ఈ నెల 18న శర్మను అరెస్టు చేశారు. ఈ నెల 29న కోర్టు ఆయనను మూడు రోజుల పోలీసు కస్టడీకి పంపింది.

ధన్కర్‌కు మరో ఎదురుదెబ్బ

కొత్త బుల్లెట్ ప్రూఫ్ కార్ల నిలిపివేత

న్యూఢిల్లీ: భారత మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు మోదీ సర్కారు మరో షాక్ ఇచ్చింది. ధన్కర్ కోసం బుక్ చేసిన మూడు బుల్లెట్ ప్రూఫ్ కార్లను కేంద్రం నిలిపివేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల అనూహ్యంగా ఉపరాష్ట్రపతి పదవికి ధన్కర్ రాజీనామా చేశారు. కేంద్రం తనకు వ్యతిరేకంగా ఉందన్న ముందస్తు అప్రమత్తతతో ముందుగానే ఉపరాష్ట్రపతి పదవికి ధన్కర్ రాజీనామా చేశారు. అయితే వయసు రీత్యా గతేడాది కొత్త బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ధన్కర్ కోరారు. ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తామని జూన్‌లో హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. నవంబర్ నాటికి వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ధన్కర్ భావించారు. అయితే ఆశ్చర్యకరంగా జులై 22న సాయంత్రం అనారోగ్యం సాకుతో ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ధన్కర్ పెట్టిన ప్రతిపాదనను తాజాగా కేంద్రం నిలిపివేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్రంతో ధన్కర్‌కు సఖ్యత చెడినట్లుగా తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూన్ 22న ప్రారంభమయ్యాయి. ఆ రోజు ధన్కర్ బాగానే ఉన్నారు. అయితే విపక్షాలు తీసుకొచ్చిన ప్రతిపాదనను ధన్కర్ ఆమోదించడం కేంద్రానికి నచ్చలేదు. దీంతో ఆయనను పదవి నుంచి తప్పించాలని కేంద్రం కుట్ర పన్నింది. ఈ విషయాన్ని ముందే గ్రహించిన ధన్కర్ పదవి నుంచి తప్పుకున్నారు.

10 రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి: కేంద్రం

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారతదేశంలో ప్రధానంగా 10 రాష్ట్రాల్లో 41 ప్రదేశాల్లో బర్డ్ ఫ్లూ కేసులు వ్యాప్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమశాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్‌పీ సింగ్ బఘేల్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. పులి, సింహం, చిరుతపులి, పెంపుడు పిల్లులు వంటి పక్షులేతర జాతులలోనూ బర్డ్ ఫ్లూ వైరస్ వల్ల ఇన్ఫెక్షన్లు సంభవిస్తాయని నిర్ధారించారు. ఇది సాధారణంగా ఊహించిన దానికంటే విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఇది మానవులకు సైతం వ్యాప్తి చెందుతోందని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. గత ఐదేళ్లతో పోలిస్తే 2025లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి తక్కువగా నమోదైంది. జూలై 24 వరకు 41 కేసులు నమోదయ్యాయి. 2024లో 49 కేసులు నమోదు కాగా... గత ఐదేళ్లలో అత్యధిక కేసులు 2021లో(118) నమోదయ్యాయి. మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి దేశీయ కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి నమోదైంది. పెరుగుతున్న ముప్పును పరిష్కరించడానికి, నివారణ, నిఘా, వేగవంతం చేశామని మంత్రి తెలిపారు. బయోసెక్యూరిటీ చర్యల అమలు వంటి వాటికి సమగ్ర మార్గదర్శకాలు అందించడానికి ప్రభుత్వం ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా నివారణ, నియంత్రణ కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను (సవరించిన 2021) రూపొందించింది. వన్యప్రాణులు, ఆరోగ్య అధికారుల సమన్వయంతో అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలలో నిఘాను బలోపేతం చేయాలని అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు సలహాలు జారీ చేశారు. వ్యాధి రహిత, స్థితిస్థాపక పౌల్ట్రీ రంగాన్ని నిర్మించడానికి పౌల్ట్రీ డిసీజ్ యాక్షన్ ప్లాన్ అభివృద్ధి చేశారు. ఈ వ్యాధితో కోళ్లు మృతి చెందడంతో పౌల్ట్రీ యజమానులకు పరిహారం చెల్లించడానికి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు భాగస్వామ్య ప్రాతిపదికన ఆర్థికంగా సహాయం చేస్తాయి.

చొరబాటుదారులా... శరణార్థులా

రోహింగ్యాలపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: రోహింగ్యాలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వాళ్లు శరణార్థులా, చొరబాటుదారులా అనేదే పెద్ద సమస్య అని, తొలుత దీనిపై స్పష్టత వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని పేర్కొంది. ఒకవేళ వాళ్లు చొరబాటుదారులైతే వారిని బహిష్కరిస్తున్నారా అని ప్రశ్నించింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'శరణార్థులా లేదా చొరబాటుదారులా అనేదే ప్రధాన సమస్య. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా అయితే, వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి? శరణార్థులు కాకుంటే, అక్రమ వలసదారులైతే... వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటుదారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా? కోర్టులు ఎటువంటి షరతులు విధించవచ్చు? అని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల తరపు న్యాయవాది మాట్లాడుతూ రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం... రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయం కేటాయిస్తామని తెలిపింది. ఇదే అంశంపై ఈ ఏడాది మేలో విచారణ జరిపిన సుప్రీం కోర్టు... దేశంలో ఉన్న రోహింగ్యా శరణార్థులు విదేశీయులని తేలితే, భారత చట్టాల ప్రకారం వారిని తిరిగి పంపించాల్సిందేనని అభిప్రాయపడింది. యూఎన్‌హెచ్‌సీఆర్ జారీ చేసిన ఐడీ కార్డులు కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవచ్చని అంతకుముందు ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసింది. ఇదిలాఉంటే, దేశంలో 12 రాష్ట్రాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ, తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వీరు ఉంటున్నప్పటికీ... కచ్చితంగా ఎంతమంది ఉన్నారనే దానిపై స్పష్టత లేదని కేంద్ర హోంశాఖ గతంలో వెల్లడించింది.

ఢిల్లీ సీపీగా ఎస్‌బీకే సింగ్‌కు అదనపు బాధ్యతలు

న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా హోంగార్డ్స్ డీజీ, ఏజీఎంయూటీ క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఎస్.బి.కె. సింగ్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సంజయ్ అరోరా పదవీకాలం గురువారంతో ముగిసింది. దాంతో ఆయన స్థానంలో కొత్త పోలీస్ కమిషనర్‌గా సింగ్‌ను నియమించారు. అవుట్ గోయింగ్ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా నుంచి సింగ్ బాధ్యతలు స్వీకరించారు. అరోరా తర్వాత ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా ఎవరిని నియమించాలనే విషయంలో తీవ్ర తర్జనభర్జనలు జరిగాయి. చివరకు 'అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం, యూనియన్ టెరిటరీస్' క్యాడర్‌కు చెందిన ఎస్.బి.కె.సింగ్‌ను పోలీస్ కమిషనర్‌గా నియమించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దోమల నిర్మూలనకు జిహెచ్ఎంసి ఫోకస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బల్దియా కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల మేరకు నగర ప్రజలను దోమల బాధ నుండి రక్షించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ముమ్మరంగా యాంటీ లార్వా ఆపరేషన్ల ఫోకస్ పెట్టింది ఒక్క జులై నెలలో 15,500కు పైగా కాలనీలల్లో దోమల నివారణకు యాంటి లార్వా ఆపరేషన్‌లు చేపట్టింది. అంతేకాకుండా దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సంబంధిత కరపత్రాలను ఇంటింటికి వెళ్లి జిహెచ్ఎంసి పంపిణీ చేస్తుంది. యాంటీ లార్వా ఆపరేషన్‌లలో వేలాది మంది సిబ్బంది పాల్గొంటుండగా ఇప్పటివరకు 34 లక్షల 45 వేల 357 ఇండ్లను రెండు మూడు సార్లు రిపీట్‌గా తనిఖీ చేయగా లార్వాతో ప్రభావమైన ఇండ్లు 1.5 శాతం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అలాగే ఒక కోటి 10 లక్షల 35 వేల కంటైనర్లను తనిఖీ చేయగా 0.5 శాతం కంటైనర్లు ప్రభావితమైనట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మాసంలో 1700 కు పైగా స్కూల్‌లలో, 320కు పైగా కళాశాలలో ఐ ఆర్ ఎస్ స్ప్రే పిల్లలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పకడ్బందీ ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న కార్యక్రమాలను కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నారు. లోటుపాట్లను సమీక్షిస్తూ యాంటీ లార్వా ఆపరేషన్లు ప్రభావంతంగా చేపట్టేందుకు అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

అర్హులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో నూతన ఫుడ్ సెక్యూరిటీ కార్డులు (రేషన్ కార్డులు) మొదటగా తేదీ ఆగస్టు 1 నుండి ఆగస్టు త్రీ వరకు లబ్ధిదారులకు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ముందుగా ఖైరతాబాద్, కంటోన్మెంట్ అలాగే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గాలలో చేపట్టామని తెలిపారు. ముందుగా సిద్ధంగా ఉన్న నూతన ఆహార భద్రత కార్డులు 55378 కార్డులతో 2,01,116 మంది లబ్ధిదారులకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. అదే విధంగా 1,37,947 పాత కార్డులలో అర్హులను చేర్చడంతో 2,32,297 మంది లబ్ధిదారులకు లబ్ది కలుగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలోని ముందుగా ఆగస్టు 1న బంజారా భవన్ బంజారాహిల్స్ ఖైరతాబాద్ ఏరియాలో ఉదయం 10 గంటలకు అలాగే మధ్యాహ్నం 12 గంటలకు లీ ప్యాలెస్ బలంరాయి జింఖానా గ్రౌండ్ ఎదురుగా, మధ్యాహ్నం 3 గంటలకు హబీబ్ ఫాతిమా నగర్ కమ్యూనిటీ హాల్, రహమత్‌నగర్ జూబ్లీహిల్స్‌లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఆగస్టు 2న ఉదయం 10 గంటలకు అంబర్పేట్ నియోజకవర్గం, మధ్యాహ్నం 12 గంటలకు ముషీరాబాద్ నియోజకవర్గం, అలాగే 3 గంటలకు సికింద్రాబాద్ నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అదే విధంగా 3 ఆగస్టున ఉదయం చార్మినార్ నియోజకవర్గం, మధ్యాహ్నం 12 గంటలకు కార్వాన్ అలాగే మూడు గంటలకు చంద్రాయనగుట్ట నియోజకవర్గంలలో రేషన్‌కార్డుల పంపిణీ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కావున ఆయా ప్రాంతాల లబ్ధిదారులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్



విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఎన్ఎండిసి కాలనీ, అనంత సరస్వతి నగర్‌లో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పాదయాత్ర చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు సెంటర్ డ్రైనేజీ సిస్టమ్ కలవాలని, పెండింగ్ ఉన్న రోడ్డు పూర్తి చేయాలని కోరడం జరిగింది. వెంటనే స్పందించి అధికారులతో కలిసి పరిశీలించి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలుపారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధిని చేపట్టనున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. దివ్యజ్యోతి, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజస్విని, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, కాలనీవాసులు సిక్కా ప్రభాకర్ గౌడ్, ఆర్.యాదగిరి, సత్తయ్య గౌడ్, ఇంద్ర సేనరెడ్డి, ఐనర్ కుమార్, హరీష్, ఓరుగంటి రమేష్, పి.మల్లేష్, వై.వి.సుబ్రహ్మణ్యం, రవీంద్రనాథ్ రెడ్డి, మల్లికార్జున రాజు, వెంటరత్నం, రాధా, కాంగ్రెస్ పార్టీ నాయకులుబాబు, ఉమేష్ సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే, మహబూబ్ నగర్ డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం సిఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై మూడు నెలలలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిఆర్ఎస్ నేతల మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది, సుప్రీం తీర్పు బిఆర్ఎస్ నేతలకు చెంపపెట్టుగా మారిందన్నారు. ఫిరాయింపులపై హరీష్‌రావు, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదని, ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్ఎస్ నాయకులు సంకలు గుద్దుకున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ లో పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు సూచించడాన్ని స్వాగతిస్తున్నామని, చట్టాలపై, కోర్టులపై కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందన్నారు. ఆనాడు బిఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో 88 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే సిగ్గు లేకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులకు పాల్పడి, మంత్రి పదవులు ఇచ్చిన నీచ చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపులకు ఆద్యుడే కేసీఆర్ అని, గతంలో బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపుల విషయంలో రాజ్యాంగ వ్యవస్థలని తప్పుదోవ పట్టిస్తే కోర్ట్ మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. అనర్హత పిటిషన్ స్పీకర్ పరిధిలోని అంశం, స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని చెప్పారు. గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై కూడా విచారణ చేయాలని, కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై కేసు వేస్తే సుప్రీంకోర్ట్ కొట్టేసిందన్నారు. 2014 లో ఎమ్మెల్యేగా టీడీపీ పార్టీలో గెలిచి, బిఆర్ఎస్ పార్టీలోకి ఫిరాయించిన వ్యక్తి మాట్లాడితే దెయ్యాలు వేదాలు

ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల కోసమే

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మా ప్రభుత్వం వేసే ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయ ప్రాంగణంలో రూ.1.5 కోట్లతో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (టీజీఐఐసీ) అత్యాధునిక వసతులతో నిర్మించిన 'తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ 3వేల మందికి పైగా సందర్శకులు వస్తుంటారు. వేచి చూసేందుకు సరైన సౌకర్యాలు లేక ఇక్కడికొచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మా దృష్టికొచ్చింది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏం అవసరమో గుర్తించి... అందుకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయింటింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకొచ్చాం. కేవలం పారిశ్రామిక, సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు ఇది నిదర్శనం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'తెలంగాణ - అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మా ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోంది. ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఈవీ రంగాల్లో అమెరికా మన రాష్ట్రానికి అగ్రగామి వ్యాపార భాగస్వామి. మన ఐటీ ఎగుమతుల్లో 38 శాతం ఉత్తర అమెరికాకు జరుగుతున్నాయి. గూగుల్, అమెజాన్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచస్థాయి కంపెనీలకు హైదరాబాద్ నిలయంగా ఉంది. ఈ ఏడాది ఒక్క జనవరిలోనే అమెరికా కంపెనీలు మన రాష్ట్రంలో రూ.31,500 కోట్ల పెట్టుబడులను పెట్టాయి. ఫలితంగా 30 వేల కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి' అని చెప్పారు. ఈ కొత్త వెయిటింగ్ ఏరియా ద్వారా అంతర్జాతీయ భాగస్వామ్యాలు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వము మహిళల అభ్యున్నతి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, మహిళలందరు ఇట్టి పథకాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీ హబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్.హెచ్.జి మహిళలు, మహిళా పరిశ్రామికవేత్తలకు ర్యాంప్ (రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ స్కీమ్) ప్రోగ్రాంపైన అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక మహిళలకు అధిక మొత్తం రుణాలను 35 శాతం సబ్సిడీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు పర్చుస్తుందని, మహిళలు అనేక రకాల వ్యాపారాలు చేస్తున్నారని, వ్యాపారంలో లాభాలను ఆర్జించడం సంతోషం కరమని తెలిపారు. ఈ ప్రోగ్రాంలో ఎంపికైన మహిళ వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్, మార్కెటింగ్ పై అవగాహన అందిస్తారు. నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు/సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి (ఎంఎస్ఎంఈ) వ్యాపారస్తులకు సబ్సిడీపై ఆర్థిక సహాయం అందనుంది. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మహిళా పరిశ్రామిక వేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని వ్యక్తిగతంగా తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ మాట్లాడుతూ దీనిలో భాగంగా టెక్స్టైల్స్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, హస్తకళలు వంటి రంగాల్లోని మహిళా వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ అండ్ డైవర్సిఫికేషన్, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్పర్ట్ మెంటరింగ్ మద్దతు అందనుందని అన్నారు.

అనంతరం ఈ ప్రాథమిక శిక్షలో ప్రోగ్రాంపైన అవగాహన కల్పించి సభ్యుల వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ సాంబశివరావు, పీడీ మెప్మ విజయ లక్ష్మీ, వీ హబ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సాయిరామ్, జిల్లా స్వయం సహాక సంఘాల అధ్యక్షులు అజయలక్ష్మి, డీఆర్పి డీఎస్. అమర్‌సింగ్, జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు తదితరులు, వీ హబ్ సభ్యులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ ద్వారా

బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు మెరుగు

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బిసి) కు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అవకాశాలు మెరుగుపడతాయని, అత్యంత వెనుకబడిన వడ్డెర సామాజికవర్గ ప్రజలకు న్యాయం జరుగుతుందని అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజా శ్రీనివాస్ ఏఐసిసి ఓబిసి డిపార్టుమెంట్ చైర్మన్ డా. అనిల్ జైహింద్ కు వివరించారు. రాజకీయ రంగంలో అత్యంత వెనుకబడిన వడ్డెర కులస్తులకు బిసి రిజర్వేషన్లు పెంచడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయంగా మరిన్ని ఎక్కువ అవకాశాలు వస్తాయని, వడ్డెరలు రాజకీయంగా ఎదిగేందుకు దోహదపడతాయని తెలిపారు. ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో గురువారం ఏఐసిసి ఓబిసి డిపార్టుమెంట్ చైర్మన్ డా. అనిల్ జైహింద్, గుంజా శ్రీనివాస్ భేటీ అయ్యారు. మరోవైపు తెలంగాణ బిసి రిజర్వేషన్ల బిల్లును సాధించుకునేందుకు ఆగస్టు 5, 6, 7 తేదీలలో ఢిల్లీలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన పోరాటానికి వడ్డెర సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని గుంజ శ్రీనివాస్ చెప్పారు. ఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగే బిసి రిజర్వేషన్ల పోరాటానికి తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వడ్డెర కులస్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరాల్సిందే నని అన్నారు. కేంద్రంలో ఓబిసిల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు, ఓబిసిల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్ ప్రత్యేకంగా నిధులను కేటాయించేందుకు కృషి చేయాలని డా. అనిల్ జైహింద్‌కు గుంజ శ్రీనివాస్ ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఇప్పటికే ఉపముఖ్యమంత్రిగా ఎస్.సి సామాజిక వర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క ఉండడం, టిపిసిసి అధ్యక్షులుగా బిసి సామాజిక వర్గానికి చెందిన బి. మహేష్ కుమార్ గౌడ్ ఉండడం సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ 'జనహిత' పాదయాత్ర ద్వారా కృషి చేస్తున్నారని డా. అనిల్ జైహింద్‌కు గుంజ శ్రీనివాస్ వివరించారు.

పదవీ విరమణ పొందిన అధికారులు, ఉద్యోగులకు సత్కారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్ఎంసి పురోగతిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు మరువలేనివని అదనపు కమిషనర్ (హెల్త్, శానిటేషన్) రఘు ప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన వివిధ స్థాయిలోని 18 మంది అధికారులు, ఉద్యోగులకు అదనపు కమిషనర్ (హెల్త్, శానిటేషన్) రఘు ప్రసాద్, అదనపు కమిషనర్ లు వేణు గోపాల్, గీతా రాధిక, సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా, పిఆర్ఓ మామిండ్ల దశరథులతో కలిసి శాలువా, పూల దండలతో సత్కరించారు. గిఫ్ట్‌లను బహుకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (హెల్త్, శానిటేషన్) రఘు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రిటైర్మెంట్ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి ముమ్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు. చీఫ్ ఇంజనీర్ (ఎస్.ఎన్.డి.పి) ఎం. కోటేశ్వరరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డి.నరేందర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి.రవీందర్, సూపరింటెండెంట్ బి.స్వామి, గేమ్స్ ఇన్ స్పెక్టర్ ఇంతైజ్ అహ్మద్, హెవి వెహికల్ డ్రైవర్ మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ కె.మోహన్ రాజ్, ఆఫీస్ సబార్డినేట్ డి.నర్సింగ్ రావు, ఫైన్ మెన్ ఎం.యాదయ్య, పి.హెచ్ వర్కర్ కె.ముత్తమ్మ, కామాటి జి.పెంటయ్య, కామాటన్‌లు బాలమణి, యాదమ్మ, లక్ష్మీ భాయి, లక్ష్మమ్మ, మాలీలు కె.ఎల్లయ్య, నర్సింహ్మా పదవీ విరమణ పొందారు. అడిషనల్ ఏ.ఎం.సి లు జీవన్ కుమార్, శారద, ఉన్నత శ్రేణి సహాయకులు రోహిత్, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

పొగతాగని వారికి కూడా క్యాన్సర్ ప్రమాదం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైనది, మరణాలకు దారితీసే ప్రధాన క్యాన్సర్లలో ఒకటి. ప్రతి సంవత్సరం మిలియన్ల మందికి ఇది నిర్ధారణ అవుతోంది. చికిత్స పద్ధతుల అభివృద్ధి జరిగినా, బాధితులను రక్షించడంలో తొందరగా గుర్తించడం ఎంతో కీలకం. అయితే ప్రజల్లో అవగాహన పెంచడమే కాక, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంపై ఆరోగ్యకర జీవనశైలిపై దృష్టి పెట్టడం ముఖ్య లక్ష్యమని కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్స్, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. జ్యోస్న తెలిపారు. ఉపిరితిత్తుల్లో నియంత్రణ లేకుండా పెరిగే కణాలు క్యాన్సర్‌గా మారతాయి. ఇవి కణితులుగా మారి ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తాయి. శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించగలవని, ఇది ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించబడుతుందని, నాన్-స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్ ఇది సుమారు 85శాతం కేసుల్లో కనిపిస్తుందని, స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్ వేగంగా వ్యాప్తి చెందే తీవ్రమైన రూపం దాలుస్తుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, తక్కువ డోస్ సిటీ స్కాన్ ద్వారా స్క్రీనింగ్ ముఖ్యంగా 55-80 ఏళ్ల వయస్సు కలిగి, పొగతాగే వారికి, రసాయనాలూ, ధూళికణాల మధ్య పని చేసే వారు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వానికి చేరిన కాళేశ్వరం నివేదిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎట్టకేలకు కాళేశ్వరం ఆయకట్టుకు సంబంధించి విచారణ నివేదికను జస్టిస్ పీసీ ఘోష్, కమిషన్ నివేదికను సమర్పించింది. గురువారం నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ కు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది, ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం,సుందిళ్ల, ఆనకట్టలకు సంబంధించి విచారించింది.115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది, కమిషన్ నివేదిక తో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయలుదేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుకు నివేదిక సమర్పించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అవినీతి, అక్రమాలు, నాణ్యతా లోపాలపై రేవంత్ సర్కారు 2024, మార్చి 14న జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ ను ఏర్పాటు చేసింది. విచారణలోని అంశాలని క్రోడీకరించి తుది నివేదికను తాజాగా ప్రభుత్వానికి సమర్పించింది.జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నుంచి నివేదిక అందుకున్న అనంతరం ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మీడియాతో మాట్లాడారు. కమిషన్ నుంచి నివేదిక తీసుకున్నామని ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావుకు అందజేస్తా మని తెలిపారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పించ డంతో నివేదికలో ఏము న్నదనేది దానిపై ప్రభుత్వ, రాజకీయ అధికార వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. కమిషన్ విచారణలో కాళేశ్వరం బ్యారేజీలలో లోపాలకు కారకులుగా ఎవరెవర్ని పేర్కొనబోతోంది అనేది సర్వత్రా చర్చనీ యాంశంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణం కేబినెట్ నిర్ణయాల మేరకు జరిగిందా లేదా అనే విషయంపై కూడా కమిషన్ దృష్టి సారించి గత కేబినెట్ మీటింగ్ మినిట్స్‌ను పరిశీలించింది. అయితే విచారణ సందర్భంగా మెజార్టీ అధికారులు గత ప్రభుత్వ పెద్దల సూచనల మేరకే మార్పులు, నిర్ణయాలు జరిగాయని కమిషన్‌కు వెల్లడించినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో కమిషన్ ఏయే అంశాలను కీలకంగా తీసుకుందని ఆసక్తికరంగా మారింది.

వెల్ ప్రీ-సర్టిఫికేషన్‌ను సాధించిన కాస్కేడ్స్ నియోపోలిస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశ రియల్ ఎస్టేట్ ఆకాంక్షలకు ప్రధాన ప్రోత్సాహకంగా, శక్తివంతమైన హైదరాబాద్ నగరానికి గర్వకారణంగా, ది కాస్కేడ్స్ నియోపోలిస్‌కు ఇంటర్నేషనల్ వెల్ బిల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ వెల్ వి2 ప్రీ-సర్టిఫికేషన్ ప్లాటినం అవార్డును ప్రదానం చేసింది. ఈ గుర్తింపు ది కాస్కేడ్స్ నియోపోలిస్‌ను భారతదేశంలో మొట్టమొదటి, ప్రపంచంలోనే అతిపెద్ద నివాస అభివృద్ధిగా నిలుపుతుంది. మన పరిసరాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై పూర్తిగా దృష్టి సారించిన ప్రపంచంలోనే మొట్టమొదటి భవన ప్రమాణం వెల్ అయినప్పటికీ, ఆరోగ్యం, వెల్నెస్-కేంద్రీకృత డిజైన్‌ను అభివృద్ధి చేయడానికి వెల్ బిల్డింగ్ స్టాండర్డ్‌ను అభివృద్ధి చేసి నిర్వహించే ప్రపంచ సాధికారత కలిగిన సంస్థ ఐడబ్ల్యూబీఐ. ఇంకా ప్రారంభించబడని, ది కాస్కేడ్స్ నియోపోలిస్ అనేది రూ. 3169 కోట్ల విలువైన 63 అంతస్తుల 217 మీటర్ల పొడవైన మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, ఇది జిహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా ఎల్ఎల్ పి, మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, ఇది ప్రధానంగా హైదరాబాద్‌లో కార్యక్రమాలను నిర్వహిస్తోన్న లెగసీ రియాలిటీ కంపెనీలు అయిన జిహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా అర్బన్‌బ్లాక్స్ రియాలిటీ ప్రమోటర్ల ఉమ్మడి కన్సార్టియం.

రైళ్లను దారి మళ్లించడంతో డబ్బు, సమయం వృథా

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి చేస్తున్న క్రమంలో పనులు సాఫీగా జరగాలని కొన్ని రైళ్లను దారి మళ్లించడం, కొన్నిటి గమ్య స్థానాలు మార్చిడం జరిగింది. అందులో భాగంగానే లింగంపల్లి వైపు నుండి- కాజిపేట్, నల్గొండ నుండి వచ్చి పోయే రైళ్లను ఘట్కేసర్- సనత్ నగర్ బై పాస్‌లైన్ మీదుగా మళ్లిం చారు. ఈ రైళ్లలో వచ్చిన ప్రయాణికులు అటు లింగంపల్లి, లేదా చర్లపల్లిలో దిగి తిరిగి తమ గమ్య స్థానాలు చేరుకోవాలి. ఇది వ్యయ ప్రయాస కాక పెద్ద మొత్తంలో సమయం డబ్బు వృథా, సనత్ నగర్ నుండి చర్లపల్లి లైన్‌లో ఎక్కడ పొడవవైన ప్లాట్ ఫారం కలిగిన స్టేషన్ ఏది లేదు. నేరెడిమేట్ స్టేషన్ మధ్య దూరంలో ఉండడమే కాక ఇరువైపులా రోడ్లు, ప్రజా రవాణా వ్యవస్థ బాగానే ఉంది. సనత్ నగర్ వైపు స్టేషన్ ప్లాట్ ఫార్మ్‌లు పెంచుకోవడానికి ఆస్కారం వుంది. పైగా స్టేషన్ చుట్టూ ప్రక్కల నివాస సముదాయాలు, గవర్నమెంట్ కార్యాలయాలు ఉన్నందున ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఈ మార్గంలో నడుస్తున్న రైళ్లను ఇక్కడ నిలిపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుం ది. కావున సికింద్రాబాద్ డివిజన్ అధికారులు ఒక సారి పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదిం పుల సలహా కమిటీ సభ్యులు నూర్ అహ్మద్ అలీ విజ్ఞప్తి చేసారు.

మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహబూబ్ నగర్ క్లస్టర్ (మహబూబ్‌నగర్, జడ్చర్ల, బూత్ పూర్)ను అభివృద్ధి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ని భారత పార్లమెంటు భవనం మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణతో కలిసి మహబూబ్‌నగర్, జడ్చర్ల, బూత్ పూర్ (మహబూబ్ నగర్ క్లస్టర్) పట్టణాలకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను ఆయన అందజేశారు. మహబూబ్‌నగర్ క్లస్టర్ నందు చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ క్లస్టర్ ఆవశ్యకత అవసరమైన అభివృద్ధి గురించి మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ మహబూబ్ నగర్ క్లస్టర్ గురించి మంత్రికి వివరిస్తూ, మహబూబ్‌నగర్ క్లస్టర్‌లోని మూడు నియోజక వర్గాలు కూడా నా పార్లమెంట్ పరిధిలో ఉన్న పట్టణాలే అని, మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధి వలన లక్షలాది మందికి లబ్ది చేకూరుతుందని, ఈ ప్రాజెక్టు మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజక వర్గానికి ఎంతో అవసరమని, ఆమె కేంద్రమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ. 975.48 కోట్ల రూపాయలు అని చెప్పారు. త్వరలో మహబూబ్ నగర్ క్లస్టర్ ప్రాజెక్టు ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతా యని అందులో ప్రధానంగా సామాజిక మౌళిక సదుపాయాలైన విద్యా, వైద్యం, ఉపాధి సాంస్కృతిక, క్రీడలు, కమ్యూనిటీ సెంటర్లు, ఆడిటోరియంలు, హెల్త్ సెంటర్లు, గ్రంథాలయాల ఏర్పాటు, పార్కుల ఏర్పాటు, ప్రజారవాణా వ్యవస్థ, రవాణా ఆధారిత అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, యువత వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి స్వయం ఉపాధికి మద్దతు ఇవ్వడానికి స్టార్ట్ అప్ ఇంక్యుబేషన్ హబ్‌లను ఏర్పాటు చేయడం, క్రీడా సముదాయాలుఏర్పాటు, ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేసి, పట్టణంలో పచ్చని ప్రదేశాల అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ విజయవాడలో

MA No. 78/2025 in FA No.754/2018

(విశాఖపట్టణం జిల్లా వినియోగదారుల ఫోరమ్ 1. విశాఖపట్టణం వారి ఫైలు CC No. 137/2016)

బిట్వీన్:

యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ చైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ ...పిటీషనర్/అప్పిలెంట్

మరియు

శ్రీ నసపాల సీతారామయ్య వగైరాలు ...రెస్పాండెంట్స్

టు,

ఆర్-1: శ్రీ నసపాల సీతారామయ్య, తండ్రి రామమూర్తి, నివాస డోర్.నెం. 39-1-9 మాధవధార, విశాఖపట్టణం-7.

ఆర్-2: గుడ్‌హెల్త్ టి.పి.ఏ. సర్వీసెస్, ఫ్లాట్ నెం.49, నాగార్జున హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్-82, తెలంగాణ రాష్ట్రం.

పైనెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్లు అయిన మీకు పైస్టేట్ కమీషన్‌వారి ద్వారా, నోటీసు పంపినను మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ ది.03-09-2025కి వాయిదా వేసియున్నారు.సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగా గాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును. (శ్రీ కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది. 03-09-2025

చేబ్రోలు యజ్ఞ నారాయణ, పిటీషనర్/అప్పిలెంట్ తరపు న్యాయవాది

కొత్తపేట, గుంటూరు.సెల్: 9848255609

హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ - అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ తెలంగాణ - అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు.

మీనాక్షి నటరాజన్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర- మొయినాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జనహిత పాదయాత్రకు విచ్చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఆమెను సత్కరించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్ర విజయవంతం కావాలని చిల్కూర్లోని బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద అంబేద్కర్, బాబు జగ్జీవన్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రారంభం కానున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్రకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బయల్దేరి వెళ్లింది. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

3న వైశ్య రాజకీయ రణభేరి...

విశాలాంధ్ర - బషీర్‌బాగ్ : జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ లయన్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్లో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో 'మేమెంతో మాకంత' వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకై ఆగస్టు 3న చలో హైదరాబాద్ పేరిట నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే వైశ్య రాజకీయ రణభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆవోపా రాష్ట్ర అధ్యక్షులు నమశ్శివాయ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ తదితర నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. 'మేమెంతో మాకంత' అనే నినాదంతో ఆగస్టు 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన వైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమానికి ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోప), ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఏసీపీఎస్) సంపూర్ణ మద్దతు తెలపడం అభినందనీయం అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికక సంస్థల ఎన్నికలో వైశ్యులకు 30 ఎంపీటీసీ, 30 జడ్పిటిసి, 1 జడ్పీ చైర్మన్, ఒక మేయర్, 15 మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు అవకాశం కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణ తేవాలన్నారు. కుల గణన నివేదికలోని అగ్ర వర్ణాల వివరాలు కులాల వారీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. స్కిల్ యూనివర్సిటీలో వైశ్యులకు 25శాతం సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వేదిక ప్రతినిధులు ఈశ్వరయ్య, ఉపేందర్, నాగేందర్, నాగరాజు, స్రవంతి, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

ఢిల్లీలో నిరసనలకు సంపూర్ణ మద్దతు



విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, విద్యావంతుల జేఏసీ పేర్కొంది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు దేవరకొండ సైదులు, కిరణ్‌కుమార్, సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. రిజర్వేషన్ల సాధనకు చివరి అడుగులు వేస్తున్నవేళ తామంతా ప్రభుత్వానికి అండగా ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఢిల్లీలో ఈనెల 5,6, 7 తేదీలలో జరగనున్న వివిధ నిరసన కార్యక్రమాల్లో తాము సైతం పాల్గొంటున్నట్లు చెప్పారు. బీసీల స్థితిగతులను అధ్యయనం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఇక్కడి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తూ ఉండడం హర్షనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్‌ను తక్షణమే నెరవేర్చాలని కోరారు. చిన్న రాములు, కోల జనార్ధన్, డాక్టర్ శివ ముదిరాజ్, మహేష్ గౌడ్, ప్రశాంత్, యాద నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రీమియర్ కాలనీ

విశాలాంధ్ర - మొయినాబాద్: మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రీమియర్ కాలనీ అంధకారంగా మారింది. గత మూడు రోజులుగా ప్రీమియర్ కాలనీలో విద్యుత్తు కాంతులు విరజిమ్మక చీకటి ఛాయలు అలుముకుంటున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమా ప్రజాప్రతినిధుల పొరపాట.. ఏది ఏమో గాని కాలనీ వాసుల కష్టాలు మాత్రం వర్ణనాతీతం. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసిన అడ్డదిడ్డంగా సమాధానం ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు.

తెలంగాణ క్రీడా రంగానికి మంచి భవిష్యత్తు

మంత్రి వాకిటి శ్రీహరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్‌ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు. తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటం ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధులతో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందజేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ బాధ్యతలు మరింత విస్తరించబోతున్నాయని వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు. ఒక ఏడాది కాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి లోపాలు తెలుసుకునేందుకు యాప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జగన్‌మోహన్ రెడ్డి ఒక యాప్‌ను ప్రారంభిస్తున్నామని ఆ యాప్‌లో ప్రజల కష్టాలను తెలుసుకుంటానని చెప్పడం మాత్రం చాలా సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తెలిపారు. గురువారం ఎన్.టి.ఆర్.ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎందుకంటే కూటమి ప్రభుత్వంలో ఎవరూ కష్టాలు పడటం లేదని, జగన్ మోహన్‌రెడ్డి గతంలో రూ.3 వేల పెన్షన్ చేస్తానని హామీ ఇచ్చి రూ.250, రూ.250, రూ.250 పెంచుకుంటూ చివరలో రూ.3 వేలు చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రూ.4 వేలకు పెంచడమే కాక ఎన్నికలు జరిగిన ఏప్రిల్, మే నెలలకు కూడా రూ.వెయ్యి చొప్పున కలిపి మొత్తం రూ.6 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం పేరుమీద ఒక ఇంటిలో ఇద్దరు పిల్లలు ఉన్నా ఒకరికే జగన్‌మోహన్ రెడ్డి డబ్బులు వేసే వారని, చంద్రబాబు అమ్మవడి పేరుతో ఎంత మంది పిల్లలు ఉన్నా అంత మంది పిల్లలకు డబ్బులు వేయడం జరిగిందన్నారు. నంద్యాలలో 11 మంది పిల్లలు ఉంటే 11 మంది పిల్లలకూ డబ్బులు వేయడం జరిగింది. కానీ జగన్ మోహన్ రెడ్డి యాప్ పెట్టడం అనేది నిజంగా చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే జగన్ మోహన్ రెడ్డి హయాం (2019-24)లో నువ్వు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కల్తీ మద్యం వల్ల ఎంత మంది చనిపోయారు? ఎన్ని తాళిబొట్టు తెగిపోయాయి, వీటన్నింటినీ జగన్ మోహన్ రెడ్డి తెలుసుకోవడానికి యాప్ అవసరం అవుతుందన్నారు. జగన్ నడిపిన కల్తీ మద్యం వల్ల దాదాపు 30 వేల మంది చనిపోయారు. ఆ వివరాలతో సహా ప్రజలు నీకు చెప్పడానికి రడీగా ఉన్నారు. మద్యం స్కాంలో పందికొక్కుల్లాగా దోచుకున్నారే మీరు, ల్యాండ్ టైటిలింగ్‌ను తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆస్తుల్ని, పొలాలను, ప్లాట్‌లను దోచుకున్నారు కదా, వీటిని తెలుసుకోవడానికి యాప్ అవసరం. అలాగే భారతదేశంలోనే జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కాబట్టి అవన్నీ ప్రజల ద్వారా తెలుసుకోవడానికి యాప్ అవసరం. నీ రాక్షస పాలనలో ప్రజావేదికను కూల్చిన దగ్గర నుంచి నువ్వు దిగిపోయేంత వరకు నీవు చేసిన అరాచకాలన్నీ తెలుసుకోవడానికి యాప్ అవసరం. సోషల్ మీడియా ద్వారా టీడీపీ పార్టీకి చెందిన మహిళల మీద ప్రచారం చేయించారు, అలాగే పోలీస్ వ్యవస్థను నీ సొంత జేబు సంస్థగా వాడుకుని ఎంతో మంది మీద అక్రమ కేసులు పెట్టావు తెలుసుకోవడానికి యాప్ అవసరం. నీకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలు ఆ యాప్‌లో ఏం పెట్టారో బయటపెట్టు, వాటిపై శ్వేత పత్రం విడుదల చేయి అని అన్నారు.

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారులను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మెల్యేల అనర్హత పై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, స్పీకర్ కు సుప్రీంకోర్టు కేవలం డైరెక్షన్ మాత్రమే ఇచ్చిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అభిప్రాయపడ్డారు. సభా హక్కులను కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదువుకోవాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలకు పార్టీలను టీఆర్ఎస్ లో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్ దని ధ్వజమెత్తారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తి బీఆర్ఎస్ పార్టీ అని, అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. దేశ ప్రజాస్వామ్యానికి మచ్చ కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అనర్హత పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటీషన్ ను సుప్రీంకోర్టు పక్కన పెట్టిందన్నారు. తెలుగుదేశంలో గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్‌లో గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని మంత్రులు చేసిన చరిత్ర కేసీఆర్ దని గుర్తు చేశారు. తెలంగాణలో కేసీఆర్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేశాడని, అలాగే 11 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ కూల్చిందని పేర్కొన్నారు. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నాడని అన్నారు. ఎమ్మెల్యే నుంచి కింద స్థాయి నాయకుల వరకు బీఆర్ఎస్ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ నిలబడి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ లో మాజీ పీసీసీ అధ్యక్షులను కూడా కేసీఆర్ తన పార్టీలో చేర్చుకున్నాడని, తెలంగాణలో తెలుగుదేశం ఉండొద్దని ఆ పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నాడని, ఇప్పుడు నారా లోకేష్ నాకు తమ్ముడు అని కేటీఆర్ మాట్లాడుతున్నాడని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలను కూడా ఖతం చేయాలని కేసీఆర్ ప్రయత్నించాడని, మేం కమ్యూనిస్టు పార్టీతో పొత్తు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని బతికించామన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం పైన స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్ గూడ చౌరస్తా నుండి సాయినాథ్ పురం వరకు, గీతా నగర్ కాలనీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎస్.రవి కిరణ్ పాల్గొని అధికారులను సమన్వయ పరుస్తూ పలు సూచనలు చేశారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎంటమాలజీ, పేదరిక నిర్మూలన విభాగం అధికారులతో వారి వారి విభాగాలు ఏ విధంగా ప్రజలకు సేవలు అందించాలో సూచించినారు. ఇంజనీరింగ్ విభాగం వర్షాకాలం రోడ్లపై పడిన గుంతలను వెంటనే పూడ్చాలని, రోడ్లపై నీరు నిలవరాదని, స్టామ్ వాటర్ డ్రైనేజీలలో చెత్త ప్లాస్టిక్ ఉండరాదని తెలిపారు. రోడ్లపై పాదచారులకు ఇబ్బంది కలిగించే అనాధికారిక షెడ్యూస్ డబ్బాలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జీవిపిలో చెత్త ఉండరాదని, చెత్తాచెదారం ఎక్కడ కూడా పేర్కొనిపోయి ఉండరాదని నిర్లక్ష్యం వహించరాదని పారిశుధ్య విభాగం వారికి సూచించారు. వర్షాకాలం అయినందున మురికికుంటలలో నీరు నిలిచిన ప్రాంతాలలో ప్రతి ఇంటికి మలేరియా లార్వీ సైడ్ పిచికారి చేయాలని, ప్రతిరోజు సాయంత్రం ఫాగ్గింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని, ఇంటింటికి మలేరియా ఆపరేషన్లు నిర్వహించాలని ఏంటమాలజి విభాగం వారినికి తెలిపినారు. బహిరంగ చెత్త వేయు ప్రాంతాలను గుర్తించాలని, ఇంటింటి చెత్త ఆటో టిప్పర్‌కు ఇవ్వని వారిని గుర్తించి స్వచ్ఛ ఆటోకు మాత్రమే చెత్తను అందించాలని జీవీపీ ప్రాంతంలోని వారికి అవగాహన కల్పించాలని పట్టణ పేదరిక నిర్మూలన విభాగం డిపిఓ మల్లికార్జున్, సి.ఓ పుష్పాలకు సూచనలు చేశారు. ప్రజలకు సేవలు అందించుటలో నిర్లక్ష్యం వహించరాదని స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాలు ప్రతి వార్డుకు రెండు రోజుల చొప్పున నిర్వహించనున్నట్లు, తద్వారా పేరుకుపోయిన చెత్తాచెదారాలు మట్టి కుప్పలు తదితరాలు తొలగించనున్నట్లు తెలిపారు, కార్యాలయ ముఖ్య అధికారులు సెక్షన్ హెడ్స్ తమ సిబ్బందితో అందరూ ఉదయం 5:30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. నిర్లక్ష్య వహించినచో చర్యలు తీసుకుంటామని, వర్షాకాలంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ లక్ష్మణ్, టౌన్ ప్లానింగ్ అధికారి బాల శ్రీనివాసరావు,

బీబీఏ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్ సర్వేలో

ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ బీబీఏ కోర్సుకు టాప్ ర్యాంక్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హైదరాబాద్‌కు చెందిన ఈథేమ్స్ కాలేజ్‌లోని బీబీఏ ప్రోగ్రాం, టైమ్స్ బీబీఏ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్ సర్వే 2025లో ప్లేస్మెంట్స్‌లో రాష్ట్రంలో నెంబర్ వన్గా, హైదరాబాద్‌లో ప్రైవేట్ బీబీఏ సంస్థలలో నెంబర్ 2గా నిలిచింది. జాతీయస్థాయిలో ఈథేమ్స్ కాలేజ్ భారతదేశంలోని అన్ని బీబీఏ కాలేజీలలో 47వ స్థానంను సాధించింది. టైమ్స్ బీబీఏ ర్యాంకింగ్ సర్వే మూడు దశల గణనీయమైన ప్రక్రియ ఆధారంగా జరిగింది. డెస్క్ రీసెర్చ్, ప్రజాభిప్రాయ సర్వే మరియు పాక్షిక (ఫ్యాక్టువల్) విశ్లేషణ. ఈ సర్వే దేశంలో అత్యుత్తమ బీబీఏ విద్యాసంస్థలను గుర్తించడానికి నిర్వహించబడింది. "ఈ బిజినెస్ స్కూల్ విద్యార్థులను స్టార్టప్ రెడీ గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దుతోంది," అని ఒక ఇండస్ట్రీ నిపుణుడు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో మహిళా లీడర్లను కూడా ఈ ప్రోగ్రాం తీర్చిదిద్దుతోంది. భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోవడానికి మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు ఉన్న ప్రొఫెషనల్స్ అవసరం. "శక్తిమంతమైన మేనేజర్స్ లేనిదే శక్తివంతమైన ఆర్థికవ్యవస్థను నిర్మించలేం" అని పెప్సీకో మాజీ సీఈఓ ఇంద్రా నూయి తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈథేమ్స్ కాలేజ్ చైర్మన్, ఈవై మాజీ రీజినల్ మేనేజింగ్ పార్ట్నర్ శ్రీ కాళి ప్రసాద్ గదిరాజు మాట్లాడుతూ "విద్య ఫ్యూచర్ రెడీగా ఉండాలి అనే తత్వంతో మేము పనిచేస్తున్నాం. విద్యార్థులు సిద్ధాంతంతో పాటు, అప్లికేషన్, ప్రాక్టీస్ అనే టీఏపీ మోడల్ ద్వారా నిజమైన ప్రపంచానికి సిద్ధమవుతున్నారు. మా క్యాంపస్ ఓ స్టార్టప్ ల్యాబ్‌లా రూపొందించబడింది. ఇండస్ట్రీ అనుభవం కలిగిన నిపుణులే మా ఫ్యాకల్టీగా మారడం ఈథేమ్స్ ప్రత్యేకత," అన్నారు.

వరద నీటి కాలువ నిర్మాణం పనుల పరిశీలన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి ఎనక్లేవ్ కాలనీ నుండి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు రూ. కోటి 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మాణం చేపట్టినటువంటి వరద నీటి కాలువ నిర్మాణం పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా 1.50 ఒక కోటి యాభై లక్షల రూపాయల నిధులతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులను చేపట్టడం జరిగినది అని, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులలో జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేసారు. త్వరలోనే వరద నీటి కాల్వ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, పనులు త్వరితగతిన చేపట్టాలని, పనులలో వేగవంతం పెంచాలని, పనుల విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అధికారులకు తెలియచేసారు. సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరుగుతుంది అని, చుట్టుపక్కల కాలనీ వాసులకు ఎంతో మంది ప్రయాణికులకు, వాహనదారులకు సాంత్వన చేకూరునని తెలియచేశారు. జలమండలి మేనేజర్ సునీత కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెరువుల పూడికతీత, సుందరీకరణ పనులు చేపట్టాలి

విశాలాంధ్ర - కాప్రా : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని బుద్ధ భవన్‌లో గురువారం ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, సాయిజన్‌శేఖర్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గం పరిధిలోని నాచారంలోని పటేల్ గుంటచెరువు, హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు, కాప్రా చెరువు, రామాంతపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువుల్లో పూడికతీత సుందరీకరణ గురించి చర్చించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వచ్చి చెరువులను సందర్శిస్తామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, కాలేరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ డివిజన్‌కు నిధులు మంజూరు

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్‌లోని జనప్రియ టౌన్ షిప్, సూర్య నగర్ కాలనీలోని బిటి రోడ్ల మరమ్మతుల పనుల కోసం 65 లక్షలు మంజూరు చేయించిన సందర్భంగా నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన జనప్రియ టౌన్ షిప్ వాసులతో కలిసి కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ప్రజలకు మళ్లీ కాంగ్రెస్ తోటే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. జనప్రియ టౌన్ షిప్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీజీ.సుదర్శన్, టీ. శ్రీకాంత్ రెడ్డి, కె.రాజేష్, బెల్లం శ్రీనివాస్, కె.సాయి కిరణ్ గౌడ్, వి.శ్రీనివాస్, బాల్ రాజ్ గౌడ్, జోష్, మహేష్ నాయక్, ప్రభాకర్ రెడ్డి, ఫసియుద్దీన్, మని, పర్వతాలు, మల్లు, కె.సురేష్ గౌడ్, ఎం.జయంత్ గౌడ్, వంగవీటి ప్రిన్సు, గడ్డం వినీష్ యాదవ్, పాషా, వెంకట్, రాకేష్, నజ్మా,సోనీ, ఇష్రాత్ బాను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల విద్వేషాలు రెచ్చగొడుతూ

రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీ

విశాలాంధ్ర - బషీర్ బాగ్: హిందూ, ముస్లింల విద్వేషాలు రెచ్చగొడుతూ బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకుంటుందని ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ ఫౌండర్, అధ్యక్షురాలు షహనాజ్ తబస్సుమ్ ఆరోపించారు. బషీర్‌బాగ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ 2014లో రిజిస్టర్ అయిందని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేజిక్కిన తర్వాత ముస్లింలకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చారని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా ముస్లింలను అణిచివేతగానే బీజేపీ పని చేస్తుందని చెప్పారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ముస్లింలకు అండగా ఉంటూ బీజేపీ వ్యతిరేక విధానాలపై చట్టసభల్లో పోరాడుతామని షహనాజ్ తబస్సుమ్ వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐఏసీపీ జాతీయ సెక్రటరీ అదిల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి వై సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి అకేపోగు ప్రమోద్ మహారాజ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు వాషిక్ సుమాన్ అజాద్, అధికార ప్రతినిధి సయ్యద్ వాలీయుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సంగమ్ హోటల్‌ను ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్ చేతుల మీదుగా గురువారం ఉదయం యజమానులు చంద్ర శేఖర్ రెడ్డి, రమణా రెడ్డి సంగమ్ హోటల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ హెూటల్ ప్రారంభం పీర్జాదిగూడలో అభివృద్ధికి మరో నూతన దిశను అందిస్తుందని ముఖ్య అతిథులు అన్నారు. పీర్జాదిగూడ ప్రాంత అభివృద్ధిలో భాగంగా సమూహ సంఘీభావాన్ని, నాయకత్వాన్ని, ప్రజాప్రతినిధుల ఐక్యతను ప్రతిబింబించింది. సంగెం హెూటల్ ప్రారంభం స్థానిక ప్రజలకు ఆతిథ్య రంగంలో మెరుగైన సేవలందించేందుకు ఒక అద్భుతమైన అవకాశంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మాజీ గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కో-అప్షన్ సభ్యులు, హనుమాన్ టెంపుల్ చైర్మన్ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేతలు, కాంగ్రెస్ మహిళా విభాగం సభ్యులు, మేడిపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం అని పెద ప్రజల సంక్షేమం కోసమే ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు గురువారం ఉదయం తొర్రూరు క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వైస్ ఛైర్మన్, భాస్కరచారి, తుర్కయంజాల్ మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకురుమ మంగమ్మ శివకుమార్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పిన పాలన

- ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఎక్కడ?
- రాష్ట్రంపై రూ.1.70 లక్షల కోట్ల అప్పు
- రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-ధర్మవరం: రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ పాలన గాడితప్పిందని, ఏడాదికాలంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.1.70 లక్షల కోట్లు అప్పు చేసిందని విమర్శించారు. సీపీఐ సత్యసాయి జిల్లా రెండవ మహాసభలు గురువారం ప్రారంభమయ్యాయి. ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ అధ్యక్షత వహించారు. రామకృష్ణ తోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, డి.జగదీష్, నాయకులు జాన్సన్‌బాబు, కాటమయ్య, జింక చలపతి, రాజారెడ్డి, చంద్రనాయక్ హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల పాలిట శాపంగా మారాయని, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. కేవలం అప్పుల కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాదికాలంలో 21సార్లు దిల్లీ వెళ్లారన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15,480 కోట్లను ప్రజలపై భారం వేశారన్నారు. 146 కోట్ల జనాభా గల భారతదేశాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తున్నారని, మన ప్రధాని నరేంద్రమోదీ మాత్రం నోరు మెదపడం లేదని నిందించారు. ట్రంప్ అబద్ధాలపై పార్లమెంటులో మోదీ నోరు విప్పలేదన్నారు. పేదలకు సీపీఐ అండగా ఉంటుందని చెప్పారు. సీపీఐ జిల్లాల మహాసభలు దాదాపు పూర్తకావచ్చాయని, ఆగస్టులు జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల్లో బీజేపీ, నరేంద్రమోదీ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. సీపీఐ అధికారం కోసమో, డబ్బు కోసమో ఆరాటపడదని, అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అవినీతి పెరిగిపోయిందని చెప్పారు. దేశంలో రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారని, అదానీ, అంబానీతో పాటు 72 శాతం మంది కోటీశ్వరుల ఆస్తులు రెట్టింపు అయ్యాయని తెలిపారు. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గిన మోదీ...పాకిస్థాన్‌తో యుద్ధం ఆపేశారని నిందించారు. రాజకీయ పాలన పేరుతో చంద్రబాబు ప్రజలను పట్టించుకోవడం మరచిపోయారన్నారు. చంద్రబాబుకు మోదీ భజన పెరిగిందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వమని చెప్పుకుంటున్నప్పటికీ... కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చిందేమీ కనిపించడం లేదని రామకృష్ణ చెప్పారు. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమాల్లో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పద్మావతమ్మ, పార్టీ, ప్రజాసంఘాల నేతలు ప్రేమ్ కుమార్, రాందాస్, మహేంద్ర, మూర్తి, సకల రాజా, నరసింహులు, జయలక్ష్మి, అంజన్ బాబు, రామకృష్ణ, దాదా పీర్, వినోద్, సురేంద్ర చౌదరి, ఆంజనేయులు, కదిరప్ప, బాలస్వామి, పవన్, మహదేవ్, కమతం కాటమయ్య, ముసుగు మధు, రవికుమార్, రమణ, శ్రీనివాసులు, వెంకటనారాయణ, వెంకటస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయండి

సీపీఐ శ్రేణులకు ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-డోన్: సీపీఐ నేతలు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా ప్రతినిధుల సభ డోన్ మార్కెట్ యార్డ్ ఎదుట క్రిస్టియన్ హాలులో సీపీఐ సీనియర్ నాయకులు ఎస్.పెద్దయ్య ప్రాంగణంలో ఆర్.సుగుణమ్మ వేదికపై గురువారం ప్రారంభమైంది. ముందుగా సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకులు సక్కి బాలమ్మ ఆవిష్కరించగా... అమరవీరుల స్థూపాన్ని సీనియర్ నాయకులు కలచట్ల రంగన్న ఆవిష్కరించారు. ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రజిత, బి.నారాయణ వ్యవహరించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, సీపీఐ విజయం కోసం అందరూ కృషి చేయాలన్నారు. నంద్యాల జిల్లా మహాసభలు విజయవంతానికి సీపీఐ శ్రేణుల కృషి ఎనలేదన్నారు. సీపీఐ బలోపేతానికి అందరూ కష్టపడాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారన్నారు. స్థానిక సమస్యలపై స్పందిస్తూ... ఉద్యమాలు చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ పోరాటాల గడ్డ డోన్‌లో జిల్లా మహాసభలు విజయవంతం చేయడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు విలువైన భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. రుద్రాక్ష గుట్ట, పేరాంటలమ్మ గుడిలో ఏళ్లతరబడి నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల కోసం ఉద్యమించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.లెనిన్ బాబు మాట్లాడుతూ వందేళ్ల చరిత్రగల పార్టీ సీపీఐ అన్నారు. పార్టీ పటిష్టతకు నాయకులు చురుకుగా పనిచేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అందరి సహకారంతో ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య మాట్లాడారు.

జిల్లా కార్యదర్శిగా రంగనాయుడు

సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శిగా ఎన్. రంగ నాయుడు, సహాయ కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా 15 మందిని, జిల్లా సమితి సభ్యులుగా 40 మందిని ఎన్నుకున్నారు.

'ధర్మస్థల' దోషులపై కఠిన చర్యలు

దేవాదాయ శాఖ పరిధిలోకి ఆలయం - ట్రస్టు సభ్యుల అరెస్టు

నారాయణ డిమాండ్

బెంగళూరు: బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేదని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. 400 మందికిపైగా మహిళలను పొట్టన పెట్టుకున్న వారిపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మస్థల ఘటనలో ట్రస్టు బోర్డు సభ్యులను అరెస్టు చేయాలని, ధర్మస్థల ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తేవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఆయన గురువారం బెంగళూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మస్థల ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని నారాయణ అన్నారు.'ధర్మస్థలంలో బలమైన ట్రస్టీ ఉండగా అక్కడ వారు చెప్పిన వారే పాలకులుగా ఉండాలి. ఎన్నికలు కూడా నామినేటెడ్ పద్ధతిలో జరుగుతాయి. కాదని పోటీకి దిగిన సీపీఎం నేతను ఏమి చేయలేక ఆయన కుమార్తెను 1980లో చంపినట్లు ఆధారాలు ఉన్నాయి. దీనిపై విచారణ కొనసాగుతోంది. అప్పటి నుంచి మహిళలు చనిపోతున్నా గుర్తించలేకపోవడం గత బీజేపీ ప్రభుత్వ వైఫల్యం. దౌర్భాగ్యకర పరిస్థితిలో మీడియా ఎదుటకు వచ్చి ఓ మహిళ ఈ వ్యవహారం వెలుగు చూడలేదు. అక్కడ మున్సిపాలిటీలో స్కేవెంజర్ భయంతో విషయాన్ని వెల్లడించారు' అని నారాయణ అన్నారు. ఆలయానికి సంబంధించి పది వేల కోట్లు డిపాజిట్లు, ఆస్తులు ఉన్నాయని, ఏడాదికి 100 కోట్లపైగా ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రసిద్ధ ఆలయాన్ని ప్రైవేటు ట్రస్టుకు అప్పగించడం ఎంత వరకు సమంజసమని నారాయణ ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ నేత శివరాజ్, ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి హరీశ్ బాల పాల్గొన్నారు.

భారత్‌కు నిత్యం అవమానాలే

ట్రంప్‌ను నిలదీయలేని కేంద్రం: సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూదిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారతదేశం నిత్యం అవమానాలను ఎదుర్కొంటోందని సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తీరును ఆక్షేపించారు. తాజాగా భారత్ ఎగుమతులపై 25శాతం సుంకంతో పాటు రష్యాతో వాణిజ్యం సాకుతో ట్రంప్ జరిమానా విధించడంపై స్పందిస్తూ భారత్-అమెరికా వాణిజ్య చర్చల వేళ ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం షాక్‌కు గురిచేసిందని సంతోశ్ కుమార్ అన్నారు. గతంలో భారతదేశాన్ని ఇంతలా అవమానించిన అమెరికా అధ్యక్షులు లేరని, ట్రంప్ వచ్చాక రోజూ అవమానాలేనని వ్యాఖ్యానించారు. అమెరికా వైఖరిపై కేంద్రప్రభుత్వ ఢీలా స్పందన మరింత ఆందోళన కలిగిస్తోందని సంతోశ్ కుమార్ అన్నారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఒక్క మాటైనా కేంద్రం మాట్లాడకపోవడమే సమస్యగా మారిందని, ట్రంప్‌ను నిలదీసే ధైర్యం కేంద్రానికి లేకపోవడం బాధాకరమని ఎంపీ అన్నారు.

నేడు కొత్తగా 1,09,155 మందికి పెన్షన్లు

మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆగస్టు నెలలో కొత్తగా 1,09,155 మంది మహిళలకు స్పౌజ్ కేటగిరిలో వితంతు పింఛన్ మంజూరు చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి నెలకు రూ. నాలుగువేల చొప్పున శుక్రవారం సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేస్తారని, దీనివల్ల ప్రభుత్వానికి అదనంగా రూ. 43.66 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. వీటితో కలుపుకుని ఒకటో తేదీ మొత్తం 63,71,595 మంది పింఛన్ దారులకు రూ.2,750.96 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఏడాది నవంబరు ఒకటో తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా స్పౌజ్ క్యాటగిరీ కింద వితంతువులకు పింఛను మంజూరు చేస్తామని ప్రకటించారని, అప్పటి నుంచి పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన పెన్షన్ దారుల భార్యలకు మరుసటి నెల నుంచి వితంతు పెన్షన్ పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. మే, 2019 నుంచి అక్టోబరు, 2024 మధ్య కాలంలో పింఛన్ తీసుకుంటూ ఉన్న భర్తను కోల్పోయిన భార్యకు పింఛన్ మంజూరు కాకుండా చాలా మంది మిగిలి పోయారని గుర్తించి, తమ ప్రభుత్వం ఆగస్టు నుంచి వారికి స్పౌజ్ కేటగిరి కింద పింఛన్ మంజూరు చేశామని మంత్రి పేర్కొన్నారు.

స్వేచ్ఛగా స్థానిక ఉపఎన్నికలు

ఎన్నికల కమిషనర్‌కు వైసీపీ ప్రతినిధుల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థలకు సంబంధించిన ఉపఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి వైసీపీ ప్రతినిధుల బృందం గురువారం విన్నవించింది. అనంతరం మీడియాతో వైసీపీ నాయకులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, దేవినేని అవినాశ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితులు కనిపించడం లేదని, నామినేషన్ వేసిన అభ్యర్థులకు పోలీసు రక్షణ కల్పించాలని, నామినేషన్ నుంచి లెక్కింపు వరకు ప్రక్రియ అంతా సీసీ కెమెరాల నిఘాలో జరగాలని ఎన్నికల కమిషనర్‌ను కోరినట్లు వైసీపీ నేతలు చెప్పారు.

జాక్సన్ బాబు పదవీ విరమణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర సమాచార కేంద్రం (విజయవాడ)లో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన చోరగుడి జాక్సన్‌బాబు వీడ్కోలు సమావేశాన్ని రాష్ట్ర సమాచార... పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. 30 సంవత్సరాలు విధిగా తన బాధ్యల్ని నిర్వర్తిస్తూ తనదైన శైలిలో సేవలు అందించిన జాక్సన్ బాబుకు ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. స్వర్ణలత మాట్లాడుతూ, జాక్సన్ బాబు దాదాపు 30 సంవత్సరాల పాటు నిర్విరామంగా పబ్లిసిటీ అసిస్టెంట్‌గా సేవలు అందించారని, ఉద్యోగ రీత్యా ఎన్నో రోజులు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చిన సందర్భంలోను సంయమనం కోల్పోకుండా బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ జాక్సన్ బాబు అందించిన సేవలు ఏంతో గొప్పవని అన్నారు. రాష్ట్ర సమాచార కేంద్రం విజయవాడ సహాయ సంచాలకులు ఎం.భాస్కర్ నారాయణ, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరామరాజు గౌడ్, నారాయణరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుదర్శన్, ఎన్టీఆర్ జిల్లా సమాచార శాఖ పీఐపీఆర్ఓ రమణ, డీపీఆర్వో మోహన్, డివిజనల్ పీఆర్వో రవి, ఎ.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

బీహార్‌లో అమానుషం

పట్నా: మనుషుల్లో మానవత్వం నశించిపోతోంది. మంచి, చెడు విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే రాక్షసుల్లా మారిపోతున్నారు. చిన్న పిల్లలపైనా అమానుషాలకు పాల్పడుతున్నారు. తాజాగా, బీహార్‌లో అత్యంత క్రూరమైన ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని కొందరు మృగాళ్లు ఇద్దరు చిన్నారులను దారుణంగా చంపేశారు. ఇంట్లోనే వారిని తగలబెట్టారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్నాకు చెందిన ఓ మహిళ ఏఐఐఎంఎస్‌లో నర్సుగా పని చేస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు అన్ష్, అంజలి ఉన్నారు. రోజూ లాగే ఆమె పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపింది. తను ఆస్పత్రికి వెళ్లిపోయింది. స్కూలు అయిపోయిన తర్వాత పిల్లలు నేరుగా ఇంటికి వచ్చారు. అయితే, గుర్తుతెలియని కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. పిల్లలతో దారుణంగా ప్రవర్తించారు. వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆ వెంటనే అక్కడి నుంచి పారిపోయారు. ఇంట్లోంచి పిల్లల అరుపులు, మంటలు వస్తుండటంతో చుట్టుపక్కల వాళ్లు ఇంటి దగ్గరకు వచ్చారు. మంటల్లో కాలిపోతున్న పిల్లల్ని కాపాడే ప్రయత్నం చేశారు. అయినా లాభం లేకపోయింది. తీవ్రగాయాల కారణంగా వారిద్దరూ చనిపోయారు. ఈ సమాచారం పిల్లల తల్లితోపాటు పోలీసులకు వెళ్లింది. తల్లి ఆస్పత్రి నుంచి పరుగులు పెట్టుకుంటూ ఇంటికి వచ్చింది. విగతజీవులుగా నేలపై పడున్న పిల్లల్ని చూస్తూ... గుండెలు బద్దలయ్యేలా వెక్కివెక్కి ఏడ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఎన్‌సీడీసీకి రూ.2 వేల కోట్ల సాయం

కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూదిల్లీ: నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ)కు రూ.2వేల కోట్ల ఆర్థిక సాయాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా నాలుగేళ్లు అందించనుంది. రుణాల కింద మరిన్ని నిధులు సమకూర్చుకోవడానికి తాజా చర్య దోహదమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.'దేశంలో 8.25లక్షలకు పైగా ఉన్న సహకార సంఘాల్లోని 29 కోట్ల మంది సభ్యులకు ఈ కార్పొరేషన్ రుణాలు అందిస్తుంది. వీరిలో 94శాతం మంది రైతులే ఉన్నారు. కేంద్రం అందించే ఈ ఆర్థిక సాయం ద్వారా అదనంగా మరో రూ.20వేల కోట్ల రుణాలను ఎన్‌సీడీసీ సమకూర్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్‌సీడీసీ రుణ రికవరీ రేటు 99.8శాతంగా ఉండగా.. సున్నా ఎన్‌పీఏ ఉన్నట్లు వైష్ణవ్ తెలిపారు.

7 వరకు హజ్ యాత్రకు గడువు

మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2026 కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును ఆగస్టు ఏడో తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న యాత్రికులందరూ ఎంబార్కేషన్ కేంద్రాల ప్రాధాన్యతలో మార్పు చేసుకుని విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని సూచించారు.

ప్రభుత్వాల కొనసాగింపుతోనే అభివృద్ధి

పెట్టుబడులు రాకుండా సింగపూర్‌కు ఈ-మెయిల్స్

రాజకీయ లబ్ధికే నీటి రాద్ధాంతాలు: లోకేశ్

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు అవసరమని, దీనివల్ల పెట్టుబడిదారులకు నమ్మకం ఏర్పడి పెట్టుబడులు పెడతారని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎంవోయూలు చేయట్లేదని, నేరుగా కార్యరూపంలోకి తెస్తున్నామని చెప్పారు. పెట్టుబడులు పెట్టాలని జూమ్‌కాల్ ద్వారా ఆర్సెల్లార్ మిత్తల్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్, డేటా సెంటర్‌లు ఏపీలో ఏర్పాటు కాబోతున్నట్లు వెల్లడించారు. '2019-24 మధ్య ఏపీ బ్రాండ్‌ను జగన్ నాశనం చేశారు. అమరావతిని సంయుక్తంగా అభివృద్ధి చేద్దామని సింగపూర్ కోరింది. ఆ దేశ ప్రభుత్వం చెప్పే మాటలు వినకుండా గత ప్రభుత్వం ఒప్పందాలను రద్దు చేసింది. పారదర్శకతలో సింగపూర్ అగ్రస్థానంలో ఉంటుంది. అలాంటి దేశంపై అవినీతి ముద్ర వేశారు. అమర్‌రాజా, లులు సహా వివిధ కంపెనీలను జగన్ తరిమేశారని మండిపడ్డారు. ఐటీ పటంలో విశాఖను పెట్టాలని నిర్ణయించుకున్నామన్నారు. మురళీకృష్ణ అనే వ్యక్తి ... సింగపూర్ ప్రభుత్వానికి మంత్రులు, అధికారులు, హైకమిషనర్ కు ...రాష్ట్రంలో అస్థిరమైన ప్రభుత్వం ఉందని, పెట్టుబడులు పెట్టొద్దని ఈ - మెయిల్ పంపారనీ, ఆయనకు వైసీపీ నేతలతో సత్సంబంధాలు ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ సంస్థతో మురళీకృష్ణకు సంబంధమున్నట్లు తెలిసిందన్నారు. ఏపీ బ్రాండ్ దెబ్బతీయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం సింగపూర్ నుంచే ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఒక రాష్ట్రం, ఒక రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి నినాదం. అనంతపురానికి కియా, కర్నూలుకు రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశం జిల్లాకు రిలయన్స్ కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్రాజెక్టు తెచ్చామన్నారు. అమరావతికి దేశంలోనే తొలిసారిగా జనవరిలో 158 క్యూబిక్ క్యాంటమ్ కంప్యూటర్ తెస్తున్నామని తెలిపారు. కర్నూలుకు డ్రోన్ సిటీ, క్యాంపా కోలా లాంటి కంపెనీలు, ఉత్తరాంధ్రకు డేటాసిటీ, ఫార్మాకంపెనీలు, ఐటీ పరిశ్రమలు, భారత్ లోనే అతి పెద్ద ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ రాబోతోందన్నారు. భారత దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ విశాఖకు రాబోతోందన్నారు. ముంబై వెళ్లి టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ తో చర్చలు జరిపామని.. దాంతో టాటా పవర్, టీసీఎస్ రాష్ట్రానికి వచ్చాయన్నారు. టాటా పవర్ 7 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను ఏర్పాటుచేయబోతోందన్నారు. విశాఖకు టీసీఎస్ ను రప్పించేందుకు ఎకరా 99పైసల చొప్పున 20ఎకరాలు ఆ సంస్థకు ఇచ్చామని, ఆ తర్వాత కాగ్నిజెంట్ వచ్చిందన్నారు. రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించేందుకే కొన్ని పార్టీలు పనిగట్టుకొని బనకచర్లపై వివాదాలు రేపుతున్నారన్నారు. తెలంగాణ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదన్నారు. మిగులు జలాలు వాడుకునేందుకు దిగువ రాష్ట్రంలో పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును నిర్మించుకుంటే ఎగువ రాష్ట్రాలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. ప్రతి ఏటా వందల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తుందన్నారు. తెలుగు వారి ప్రయోజనాల కోసం తెలంగాణాతో కలసి పనిచేస్తామన్నారు.

భారత ప్రయోజనాలు కాపాడతాం

ట్రంప్ సుంకాలపై కేంద్రం

న్యూదిల్లీ: దేశంతో పాటు చిన్న పరిశ్రమ, రైతులు, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర వాణిజ్య, మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అమెరికా సుంకాలపై పార్లమెంటులో మాట్లాడుతూ పర్యవసానాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అమెరికాతో చర్చలు కొనసాగిస్తామన్నారు. ఎగుమతిదారులు, పరిశ్రమలతో సహా అందరి వాటాదారులతో మంత్రిత్వ శాఖ నిమగ్నమై పరిస్థితిని అంచనా వేసిన తర్వాత అభిప్రాయాన్ని తీసుకుంటుందని గోయల్ చెప్పారు. సంస్కరణలు, రైతులు, ఎంఎస్‌ఎంఈలు, వ్యవస్థాపకుల కృషి కారణంగా 11వ ఆర్థిక వ్యవస్థ స్థాయి నుంచి టాప్ 5లో నిలిచాం. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతున్నాం. అంతర్జాతీయ సంస్థలు, ఆర్థికవేత్తలు భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రకాశవంతమైన ప్రదేశంగా చూస్తున్నాయి. ప్రపంచ వృద్ధిలో దాదాపు 16 శాతం వాటాను భారత్ కలిగి ఉంది' అని అన్నారు. రక్షణాత్మక ప్రపంచంలో సౌదీ, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఈఎఫ్‌టీఏ దేశాలతో భారత్ పరస్పరం ప్రయోజనకర వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుందని గోయల్ చెప్పారు. ఇతర దేశాలతోనూ ఒప్పందాలు చేసుకుంటామన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, ఆహార భద్రతను నిర్ధరించడానికి కృషి చేస్తున్నామన్నారు.

ఇదో ప్రకటన: కాంగ్రెస్ అమెరికా సుంకాలపై పీయూష్ గోయల్ వ్యాఖ్యలను కాంగ్రెస్ తప్పుపట్టింది. గోయల్ చేసింది అసలు ప్రకటేనా అని దుయ్యబట్టింది. పీయూష్ గోయల్ నాన్-స్టేట్మెంట్ చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంలో వైఫల్యం, సుంకాలు విధించడం సహా నిజమైన సమస్యలను ప్రస్తావించలేదని అన్నారు. భారతీయ వ్యాపారుల ఆందోళనలు, మనోభావాలను పరిష్కరించలేదని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.